Follow: @ANNTELUGU

17-01-2025

ANN తెలుగు

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 46 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఆరుకోట్ల భక్తులు.. నాలుగురోజుల్లోనే

### మహా కుంభమేళా.. మహా భక్తి పారవశ్యం

మహా: మహా కుంభమేళా భక్తజనం పారవశ్యంతో వైభవోపేతంగా సాగుతోంది. మహాకుంభమేళా 2025 గురువారం తెల్లవారుజామున 5 గంటల నుండే వివిధ రంగాలకు చెందిన భక్తులు త్రివేణీసంగమంలో మునిగిపోయారు . యమునా, గంగా 'ఆధ్యాత్మిక' సరస్వతి మూడు నదుల సంగమం. ఉత్తర భారతదేశం చలిగాలులతో అతలాకుతలం అవుతుండగా, తేలికపాటి చినుకులతో ఉష్ణోగ్రత మరింత పడిపోయింది. అయినా భక్తులు హరహరమహాదేవ అంటూ పోటెత్తుతున్నారు. కుంభమేళా ప్రారంభమైన మొదటి నాలుగు రోజుల్లోనే 6 కోట్ల మంది భక్తులు సంగమంలో స్నానాలు చేశారు. 45 రోజుల పండుగ ముగిసే నాటికి ఈ సంఖ్య 50 కోట్లు దాటుతుందని అంచనా.

**టాప్ న్యూస్**

## ఇస్రో మరో చరిత్ర

- రెండు ఉపగ్రహాలు విజయవంతంగా అనుసంధానం
- ఈ ఘనత సాధించిన నాలుగోదేశం




02

## రింగ్ రోడ్డు సమీపంలోని భూములపై మంత్రి కన్ను

- రాయించుకునే ప్రయత్నం చేస్తున్నారు
- ఎంపీ రఘునందన్ రావు ఆరోపణ



03

## ఎన్టీఏ సంచలన నిర్ణయం

- సింగిల్ డే, సింగిల్ షిఫ్ట్‌లో నీట్ పరీక్ష
- ఓఎంఆర్ బేస్డ్‌గా పరీక్ష నిర్వహణ



03



## జైలుకు ఇవి పట్టుకెళ్ళు కేటీఆర్

- రాజాసింగ్ ఉచిత సలహా
- నాలుగుజతల బట్టలు, ఒక దుప్పటి, పచ్చడిప్యాకెట్ లిస్ట్ చెప్పిన బిజెపి ఎమ్మెల్యే
- ఒకరిని అన్యాయంగా అరెస్ట్ చేసి ఎవరు జైలుకు పంపుతారో..
- వారికీ అదే గతి పడుతుందంటూ ఫైర్

02



## ఈ కార్ రేసు కేసులో ఏసీబీ దూకుడు

- ఏస్ నెక్స్ట్ జెన్ కంపెనీకి నోటీసులు
- రేపు విచారణకు రావాలని ఆదేశం

02



## సైఫ్‌కు కత్తి పోట్లు

- ఇంట్లో దూరి ఆరు పోట్లు పొడిచిన దుండగుడు
- లీలావతి ఆసుపత్రిలో చికిత్స
- ప్రస్తుతానికి సేఫ్

08



# క్వశ్చన్ పేపర్ సేమ్

## ఏసీబీ లాగే ఈడీ ప్రశ్నలు

### అడిగిన ప్రశ్నలే తిప్పితిప్పి అడిగారు

- ఎన్నిసార్లు పిలిచినా వస్తా.. విచారణకు సహకరిస్తా..
- రేవంత్ రెడ్డి కాస్కో.. లై డిటెక్టర్ టెస్ట్‌కు నేను రెడీ
- విచారణ అనంతరం మీడియాతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఏడుగంటల పాటు సాగిన విచారణ.. బయట బీఆర్ఎస్ శ్రేణుల ఉత్కంఠ
- ఉదయం 10.40కి ప్రారంభమై సాయంత్రం 5.45కు ముగిసిన విచారణ

**హైదరాబాద్, మహా:** ఏసీబీ లాగానే ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ కూడా అడిగిన ప్రశ్నలనే మళ్లీ మళ్లీ అడిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. 7 గంటల పాటు కొనసాగిన ఈడీ విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

మిగతా 2లో

### ఎనీ టైమ్, ఎనీ సెంటర్.. నేను రెడీ..

మీకు ధైర్యముంటే వెంటనే నిర్ణయం తీసుకోండి. డేట్ మీరే చెప్పండి, టైమ్ మీరే చెప్పండి, ప్లేస్ మీరే చెప్పండి. నిజాయితీగా నా చెయ్యి ఇస్తా. లై డిటెక్టర్ టెస్ట్ కి మీరు కూడా కూర్చోండి. ఈడీ విచారణకు ఇంకా ఎన్నిసార్లు రమ్మన్నా వస్తా. ఎన్ని ప్రశ్నలు అడిగినా సమాధానం చెబుతా. ఎన్ని రకాల పరీక్షలు పెట్టినా భరిస్తా. ఎందుకంటే అంతిమంగా న్యాయం, ధర్మం, నిజం, నిజాయితీ గెలుస్తాయి. కోర్టులు, న్యాయమూర్తులపై మాకు విశ్వాసం ఉంది" అని కేటీఆర్ అన్నారు.



కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్ రెడ్డి జయంతి సందర్భంగా పుష్పాంజలి ఘటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి, ఎంపీ సురేష్ షట్కర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, రోహిన్ రెడ్డి, గడ్డం వినోద్, తదితరులు

## లిక్కర్ స్కామ్ పార్టీని ఓడిస్తాం

### ఢిల్లీ లిక్కర్ స్కాం పార్ట్‌నర్ బీఆర్ఎస్‌ను తెలంగాణలో ఓడించాం

ఇపుడు అసలు పార్ట్‌నర్‌ను ఢిల్లీలో ఓడిస్తాం.. సీఎం రేవంత్ సంచలన కామెంట్స్

రెండు గ్యారంటీ హామీల పోస్టర్లు విడుదల



**ఢిల్లీ, మహా:** ఢిల్లీ లిక్కర్ స్కాం పార్టనర్ బీఆర్ఎస్‌ను తెలంగాణలో ఓడించామని.. ఇప్పుడు అసలు పార్ట్‌నర్ ఆప్‌ను ఢిల్లీలో ఓడిస్తామని సీఎం రేవంత్ ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ కీలక హామీలను ప్రకటించింది. హామీల పోస్టర్లను రేవంత్ విడుదల చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ ఇవ్వనున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. తెలంగాణలో ఇచ్చిన హామీలను నెరవేర్చి చూపించామని.. ఇప్పుడు ఢిల్లీలో తెలంగాణ తరహా హామీలను ఇస్తున్నామన్నారు. తెలంగాణలో రూ.21 వేల కోట్ల మేర రైతు రుణమాఫీ చేశామన్న రేవంత్.. ఇది తమ పార్టీ నిబద్ధతను తెలియజేస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణలో యువతకు ఏడాదిలో 55 వేల ఉద్యోగాలు కల్పించామని చెప్పిన సీఎం.. . ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం విజయవంతంగా కొనసాగుతుందని తెలిపారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెస్తే హామీలు అమలు చేయించే బాధ్యత తాను

మిగతా 2లో



### కృష్ణా జలాల విషయంలో

## ట్రైబ్యునల్ కీలక నిర్ణయం

### విభజన చట్టంలోని మూడో సెక్షన్ ప్రకారం వాదనలు వింటామన్న బ్రిజేష్ ట్రైబ్యునల్

811 టీఎంసీలలో రెండు రాష్ట్రాల వాటాను తేల్చడం ముఖ్యమని వెల్లడి

ఫిబ్రవరి 19 నుంచి 21 వరకు వాదనలు వింటామన్న బ్రిజేష్ ట్రైబ్యునల్

**ఢిల్లీ, మహా:** ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్ కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం సమర్పించిన అదనపు టర్మ్ ఆఫ్ రెఫరెన్స్‌పై మొదట విచారణ చేపట్టాలని ట్రైబ్యునల్ నిర్ణయించింది. ఏపీ పునర్విభజన చట్టంలోని మూడో సెక్షన్ ప్రకారం ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా జలాల పంపిణీ అంశంపై తొలుత వాదనలు వింటామని తెలిపింది. 811 టీఎంసీలలో రెండు రాష్ట్రాల వాటాను తేల్చడం ముఖ్యమని ట్రైబ్యునల్ పేర్కొంది. మూడో సెక్షన్ ప్రకారం రెండు రాష్ట్రాలకు కేటాయింపులపై ఫిబ్రవరి 19 నుంచి 21 వరకు వాదనలు వింటామని తెలిపింది. ఆ తర్వాత 89వ సెక్షన్ ప్రకారం ప్రాజెక్టుల వారీగా కేటాయింపుపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది.

# ఇక ఆపలేం సారూ..

### ఎమ్మెల్యేలు జారకుండా.. బీఆర్ఎస్ బిగ్ ప్లాన్

ఢిల్లీలోనే హరీష్ మకాం.. కేసీఆర్ ఆదేశాలతో సుప్రీంలో పిటీషన్


న్యాయనిపుణులతో సంప్రదింపులు.. పార్టీమారిన వారిపై అనర్హతకు పట్టు

మిగతా ఎమ్మెల్యేలు పార్టీ మారకుండా ఒత్తిడి వ్యూహం



**ఢిల్లీ , మహా:** బిఆర్ఎస్ పార్టీకి ప్రస్తుతం 28మంది మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇందులో చాలా మంది ఎమ్మెల్యేలు పార్టీతో అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఓ వైపు వెళ్ళిన ఎమ్మెల్యేలు తిరిగి వస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేసినా చాలా మంది ఎమ్మెల్యేలు ఆగేలా కనిపించడం లేదు. ఉన్న వారిలో చాలా మంది రాజకీయ అనుభవజ్ఞులు ఉండడంతో ప్రభుత్వ స్థిరత్వాన్ని చూసి వెళ్తారోమోనన్న అనుమానాలున్నాయి. ఎవరెవరు సంప్రదింపుల్లో ఉన్నారు అధినేత దగ్గర సమాచారం ఉన్నా.. బుజ్జగింపులు చేయడం తప్ప ఈ స్థితిలో మరేం చేయలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు కేసీఆర్ కుటుంబం కేసుల దాడిని ఎదుర్కొంటోంది. ఓ వైపు కేసులు, మరోవైపు ప్రజా ఉద్యమాలకు తోడు, ఎమ్మెల్యేలను కాపాడుకోవడం కూడా పెద్ద టాస్కే.

మిగతా 2లో




## ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

### 8వ వేతన సంఘం ఏర్పాటు

ఆమోదం తెలిపిన కేంద్ర కేబినెట్



03

### ఛత్తీస్ గఢ్-తెలంగాణ సరిహద్దులో

## భారీ ఎన్‌కౌంటర్

- 17 మంది నక్సల్స్ మృతి
- మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ
- బీజాపూర్ జిల్లాలో కాల్పుల మోత

02



## జైలుకు ఇవి పట్టుకెళ్ళు కేటీఆర్

- రాజాసింగ్ ఉచిత సలహా
- నాలుగుజతల బట్టలు, ఒక దుప్పటి, పచ్చడిప్యాకెట్ లిస్ట్ చెప్పిన బిజెపి ఎమ్మెల్యే
- ఒకరిని అన్యాయంగా అరెస్ట్ చేసి ఎవరు జైలుకు పంపుతారో..
- వారికీ అదే గతి పడుతుందంటూ ఫైర్

**హైదరాబాద్, మహా:** మాజీ మంత్రి కేటీఆర్, బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ మధ్య ఎప్పటికప్పుడు ట్విట్టర్ వేదికగా మాటల యుద్ధం జరుగుతున్న సంగతి తెలిసిందే. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పలుమార్లు ట్వీట్లతో సవాళ్లు విసురుకున్న వీరిద్దరూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాస్త కూల్ అయిపోయారు. అయితే ఇప్పుడు మళ్లీ కేటీఆర్ పై వ్యంగ్యంగా ట్వీట్ చేశారు రాజాసింగ్. కేటీఆర్ జైలుకు వెళ్లటం ఖాయమని.. కావల్సిన లిస్ట్ ముందే రెడీ చేసుకోమని హెచ్చరించారు. మాజీ మంత్రి కేటీఆర్ పై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యంగ్యంగా ట్వీట్ చేశారు. నాపై తప్పుడు కేసులు పెట్టి BRS అన్యాయంగా అరెస్ట్ చేయించింది. ఇప్పుడు కేటీఆర్ కూడా జైలుకు వెళ్తున్నాడు అంటూ తెలిపిన రాజాసింగ్... జైలుకు పోతే ముందు ఈ వస్తువులు తీసుకెళ్లమని లిస్ట్ కూడా రెడీ చేశారు. ఆ లిస్ట్ లో నాలుగు జతల బట్టలు , ఒక దుప్పటి, టవల్, హ్యాండ్ కర్చీఫ్ , సబ్బు, పచ్చడి ప్యాకెట్, స్వెట్టర్ తీసుకెళ్లమంటూ వ్యంగ్యంగా చెప్పారు. అంతేకాకుండా ఎవరైతే అన్యాయంగా వేరొకరిని అరెస్ట్ చేసి జైలుకు పంపుతారో చివరికి వాళ్లు కూడా అదే విధంగా జైలుకు పోవాల్సి వస్తుందని తెలిపారు. ప్రస్తుతం రాజాసింగ్ ట్వీట్ వైరల్ గా మారింది.



# క్వశ్చన్ పేపర్ సేమ్

(మొదటిపేజీ తరువాయి)

అడిగిన ప్రశ్నలనే తిప్పి తిప్పి అడిగారని, విచారణకు ఎన్నిసార్లు పిలిచినా వస్తానని ఈడీకి చెప్పినట్లు కేటీఆర్ తెలిపారు. తాను ఏ తప్పు చేయకున్నా చట్టాలను గౌరవించే పౌరుడిగా విచారణకు వచ్చానని, ఒక్క రూపాయి అవినీతి చేయలేదని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డిపై ఈడీ కేసు ఉందని, అందుకే తనపై కూడా కేసు పెట్టించారని కేటీఆర్ ఆరోపించారు. జడ్జి ముందు ప్రత్యక్ష విచారణకు సిద్ధమని, దమ్ముంటే సీఎం రేవంత్‌రెడ్డి రావాలని సవాల్ విసిరారు.

**ముందుకు రా.. ఎవరి నిజాయితీ ఏంటో రాష్ట్రం మొత్తం చూస్తుంది**

"ప్రజాధనం దుర్వినియోగం అయ్యేలా, ఇంతమంది ఉన్నతాధికారుల సమయం వృథా అయ్యేలా, ఇన్ని మీడియా సంస్థల టైమ్ వేస్ట్ అయ్యే విధంగా కక్ష సాధింపు విచారణ మంచిది కాదు. నేను రెడీగా ఉన్నా. ధైర్యముంటే ముందుకు రా. జూబ్లీహిల్స్ ప్యాలెస్ లో అయినా సరే, ఏసీబీ న్యాయమూర్తి ఇంట్లో అయినా సరే, కోర్టులో అయినా సరే, ఈడీ ఆఫీస్ లో అయినా సరే.. నేను లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధం. మీరు కూడా రండి. ఇద్దరం కూర్చుందాం. దొంగ ఎవరో తెలిసిపోతుంది. ఎవరి నిజాయితీ ఏంటో రాష్ట్రం మొత్తం చూస్తుంది అని విచారణ అనంతరం కేటీఆర్ అన్నారు.

**ఉదయం నుండి ఉద్రిక్తత**


మరోవైపు కేటీఆర్ విచారణకు హాజరైన నేపథ్యంలో ఉదయం నుండి అరెస్ట్ ప్రచారంతో ఉత్కంఠ నెలకొంది. ఈడీ కార్యాలయానికి బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. కొందరు కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈడీ కార్యాలయం వద్దకు వచ్చిన ఎమ్మెల్యే గోపినాథ్, బాల్కసుమన్, ఆర్.ఎస్.ప్రవీణ్లను వెళ్లిపోవాలని ఆదేశించారు. ఈడీ ఆఫీసు వైపు వచ్చే వాహనాలను పోలీసులు దారి మళ్లించారు. ఉదయం 10.40 గంటలకు ప్రారంభమైన విచారణ సాయంత్రం 5.45 గంటలకు ముగిసింది. ఇప్పటికే ఈడి రెండుసార్లు అరవింద్ కుమార్ ను విచారించగా, గురువారం మొబైల్ చాట్ ఆధారంగా పలు ప్రశ్నలు అడిగినట్లు చెబుతున్నారు. ఉదయం కేటీఆర్ తో ఒక్కసారిగా నేతలు, కార్యకర్తలు రాగా పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకుని వాహనాల్లో తరలించారు. సాయంత్రం కూడా భారీగా నేతలు తరలివచ్చారు. కేటీఆర్ ఇప్పటికే ఒకసారి ఏసిబి, మరోసారి ఈడి విచారణలకు హాజరయ్యారు. కేటీఆర్ వెంట గంగుల కమలాకర్ తో పాటు ముఖ్యనేతలు సమావేశంలో పాల్గొన్నారు. కాగా ఏమైనా అవకతకలు ఉన్నట్లు సందేహాలుంటే అధికారులను అడిగి తెలుసుకోవాలంటూ విచారణలో కేటీఆర్ ట్విస్ట్ ఇచ్చినట్లు సమాచారం. ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో నిబంధనల ఉల్లంఘన ఏదైనా ఉన్నట్లయితే అది అధికారులే చూసుకోవాలని, మంత్రిగా తనకు ఏంటి సంబంధం అని విచారణలో ఎదురు ప్రశ్నించినట్లు తెలిసింది. ఈడి ఈ వ్యవహారంలో ఎలా ముందుకెళ్తుందో చూడాలి.

# లిక్కర్ స్కామ్ పార్టీని ఓడిస్తాం

**ఢిల్లీ లిక్కర్ స్కాం పార్టనర్ బీఆర్ఎస్‌ను తెలంగాణలో ఓడించాం**

ఇపుడు అసలు పార్ట్నర్‌ను ఢిల్లీలో ఓడిస్తాం.. సీఎం రేవంత్ సంచలన కామెంట్స్

రెండు గ్యారంటీ హామీల పోస్టర్లు విడుదల



(మొదటిపేజీ తరువాయి)

తీసుకుంటానని అన్నారు. దేశంలో నిరుద్యోగం పెద్ద సమస్యగా మారిందని.. మోడీ ప్రభుత్వం 2 కోట్ల ఉద్యోగాల హామీ ఇచ్చింది.. అమలు చేసిందా? అని సీఎం నిలదీశారు.

**మోదీ, కేజ్రీవాల్ ఒక్కటే**

ప్రధాని మోడీ, కేజ్రీవాల్ ఇద్దరు ఒక్కటేనని .. పేర్లు మాత్రమే వేరు, ఇద్దరు అబద్ధాలు ఆడుతారని విమర్శించారు. కాలుష్యంతో తెలంగాణ ప్రజలు ఢిల్లీకి రావాలంటే భయపడుతున్నారని సీఎం తెలిపారు. షీలా దీక్షిత్ నేతృత్వంలోనే ఢిల్లీ అభివృద్ధి జరిగిందన్నారు సీఎం రేవంత్. ఆప్, బీజేపీ ఢిల్లీకి ఏం చేశాయని సీఎం ప్రశ్నించారు. మోదీ, కేజ్రీవాల్ ఢిల్లీని ఆగం పట్టించారని మండిపడ్డారు. ఢిల్లీ మెట్రో, సీఎన్ జీ వాహనాలు కాంగ్రెస్ తెచ్చిందని.. కాలుష్యం తగ్గించే చర్యలు చేపట్టకుండా.. సెలవులివ్వడం పైనే మోదీ, కేజ్రీవాల్ పోటీ పడుతున్నారని విమర్శించారు. మార్పు కోసం కాంగ్రెస్ కు ఓటు వేయాలని సీఎం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ పీసీసీ అధ్యక్షుడు దేవేంద్ర యాదవ్, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

**ఫిబ్రవరి 5న ఎన్నికలు**

ఢిల్లీలోని మొత్తం 70 నియోజవర్గాలకు ఫిబ్రవరి 5న ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 8న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ ఎన్నికల్లో గెలిచేందుకు అధికార, విపక్ష పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్, కాంగ్రెస్, బీజేపీ మధ్య గట్టి పోటీ ఉండనుంది. 2020 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఘన విజయం సాధించింది. ఇక్కడ మొత్తం 70 సీట్లకు గాను ఆప్ 62 సీట్లు గెలుచుకోగా, బీజేపీ కేవలం 8 సీట్లు మాత్రమే గెలుచుకుంది. కాంగ్రెస్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. ఒక్క అభ్యర్థి కూడా గెలవలేకపోయారు.

# ఇస్రో మరో చరిత్ర

**రెండు ఉపగ్రహాలు విజయవంతంగా అనుసంధానం**

**ఈ ఘనత సాధించిన నాలుగోదేశం**



**మహా:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ నూతన ఏడాది ప్రారంభంలోనే మరో సరికొత్త చరిత్ర సృష్టించింది. ఇటీవల నింగిలోకి పంపించిన రెండు ఉపగ్రహాలను విజయవంతంగా అనుసంధానం చేసింది. ఈ మేరకు స్పేడెక్స్ డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయినట్లు ఇస్రో గురువారం ఎక్స్ వేదికగా వెల్లడించింది. ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ అవతరించింది. గత డిసెంబర్ 30 న తిరుపతి జిల్లాలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ లో నుంచి పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సీ 60 లో జంట ఉపగ్రహాలను ఇస్రో నింగిలోకి పంపింది. ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ బయల్దేరిన 15.09 నిమిషాలకు స్పేడెక్స్1 బి, 15.12 నిమిషాలకు స్పేడెక్స్ 1ఏ రాకెట్ నుంచి విడిపోయాయి. ఆ తర్వాత వీటి డాకింగ్ కోసం మూడుసార్లు ప్రయత్నించగా..పలు కారణాల వల్ల ఇది వాయిదా పడుతూ వచ్చింది. చివరకు గురువారం వీటి అనుసంధాన ప్రక్రియను చేపట్టారు. ఈ క్రమంలోనే రెండు ఉపగ్రహాల మధ్య దూరాన్ని 15 మీటర్ల నుంచి 3 మీటర్లకు తీసుకొచ్చారు.

**ఆ దేశాల సరసన**

అక్కడ ఉపగ్రహాలను హోల్డ్ చేసి డాకింగ్ ను మొదలు పెట్టారు.ఇది విజయవంతమైనట్లు ఇస్రో తమ పోస్ట్ లో రాసుకొచ్చింది.దీని కోసం శ్రమించిన సాంకేతిక బృందానికి, యావత్ భారతీయులకు అభినందనలు తెలిపింది. ఇప్పటి వరకు చైనా, రష్యా, అమెరికా మాత్రమే అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను అనుసంధానం చేస్తున్నాయి. తాజా ప్రయోగంతో ఈ తరహా సాంకేతికతలో భారత్ కూడా వాటి సరసన చేరింది.

## ఛత్తీస్ గఢ్-తెలంగాణ సరిహద్దులో భారీ ఎన్‌కౌంటర్

**17 మంది నక్సల్స్ మృతి**

**మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ**

**బీజాపూర్ జిల్లాలో కాల్పుల మోత**



**మహా:** ఛత్తీస్ గఢ్ లో వరుస ఎన్ కౌంటర్లతో నక్సల్స్ కు గట్టి ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఛత్తీస్ గఢ్ లో గురువారం మరో భారీ ఎన్ కౌంటర్ జరిగింది. ఈ ఎదురుకాల్పుల ఘటనలో 17 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఛత్తీస్ గఢ్‌తెలంగాణ సరిహద్దు అటవీప్రాంతం కాల్పుల మోతతో దద్దరిల్లింది. బీజాపూర్ జిల్లా బారేడుబాక అటవీ ప్రాంతం వద్ద భద్రతా దళాలకు, నక్సల్స్ కు మధ్య కాల్పులు జరిగాయి. యాంటీ నక్సల్ ఆపరేషన్ చేపడుతున్న సంయుక్త భద్రతా దళాలకు మావోయిస్టులు తారసపడ్డారు. ఉదయం 9 గంటల నుంచి కాల్పులు జరిగాయి. ఘటన స్థలం నుంచి పోలీసులు పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

## కుంభమేళాపై తప్పుడు ప్రచారం చేస్తే తాట తీస్తాం: యూపీ సీఎం యోగి



**మహా :** ప్రయాగ్‌రాజ్ కుంభమేళాపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై ఉత్తర ప్రదేశ్‌లో యోగి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ప్రయాగ్‌రాజ్ కుంభమేళాలో చలి తీవ్రతతో 11 మంది చనిపోయారని సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చలిని తట్టుకోలేక చాలామంది ఆస్పత్రుల పాలయ్యారని, అధికారులు పట్టించుకోవడం లేదని పోస్ట్ పెట్టిన లాలూ యాదవ్ సంజీవ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. సంజీవ్ సమాజ్‌వాదీ పార్టీ కార్యకర్తగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. కుంభమేళాపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన వాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఇప్పటికే ప్రకటించారు. లక్నోలో ముఖ్యమంత్రి నైట్ షెల్టర్‌ను సందర్శించారు. దుప్పట్లు , స్వెట్లర్లను పంపిణీ చేశారు. భక్తుల్లో అశాంతిని , అలజడిని రేపేందుకు కొంతమంది కుట్రలు చేస్తున్నారని యోగి ఆరోపించారు. ఇలా తప్పుడు ప్రచారం చేస్తే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. మరోవైపు,ప్రయాగ్‌రాజ్ కుంభమేళా నాలుగో రోజుకు చేరుకుంది. భక్తులతో, సాధువులతో ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమం కిటకిటలాడుతోంది. భక్తులు, స్వామీజీలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాటు చేసినట్టు సీఎం యోగి తెలిపారు. కుంభమేళా ప్రాంగణంలో వైద్య శిబిరాలు 24 గంటల పాటు పని చేస్తున్నట్టు తెలిపారు. భక్తులు అస్వస్థతకు గురైతే వెంటనే చికిత్స అందించేందుకు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. కుంభమేళాను ఇప్పటికే కోట్లాదిమంది భక్తులు సందర్శించారు.

# ఇక ఆపలేం సారూ..

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంలో స్పీకర్ నిర్ణయం తీసుకోకపోవడంతో ఓవైపు కేటీఆర్ ఈడి విచారణను ఎదుర్కొంటున్నా, మరోవైపు గులాబీదళపతి కేసీఆర్ పార్టీ కీలక నేత హరీష్ రావును ఢిల్లీ పంపారు. న్యాయనిపుణులతో మాట్లాడి కేసును వేయించారు. గురువారం సుప్రీంకోర్టులో బిఆర్ఎస్ పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని ఫిర్యాదుచేసింది. హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్పీకర్ ఇప్పటివరకు ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంతో బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టులో రెండు పిటిషన్ లు దాఖలు చేసింది.. 10మంది ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేసి 9నెలలు అవుతున్నా.. స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని బీఆర్ఎస్ తన పిటిషన్ లో పేర్కొంది. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్‌కు వ్యతిరేకంగా ఎస్ఎల్పీ దాఖలు చేసింది. మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్య, డాక్టర్ సంజయ్, అరికెపూడి గాంధీ, ప్రకాశ్ గౌడ్, మహిపాల్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డిపై రిట్ పిటిషన్ దాఖలు చేసింది.

కాగా, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఈ పిటిషన్లు దాఖలు చేసేందుకు కేసీఆర్ ఆదేశాలతో ఢిల్లీకి వెళ్లారు.. ముందుగా, అక్కడ పార్టీ కార్యాలయంలో ఉన్న లీగల్ టీమ్ తో చర్చలు జరిపారు.. అలాగే హరీశ్ ఇతర సీనియర్ న్యాయవాదుల అభిప్రాయాలను తీసుకున్నారు. అనంతరం రెండు పిటిషన్లు పార్టీ న్యాయవాదుల ద్వారా సుప్రీంకోర్టులో దాఖలు చేయించారు. ఇదిలా ఉంటే తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరుపున గెలిచిన 10మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ పార్టీలోకి మారారు. బీఆర్ఎస్ బీ ఫారం మీద గెలిచి వేరే పార్టీలోకి వెళ్ళిన వీరందరినీ అనర్హులుగా ప్రకటించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద హైకోర్టుకు వెళ్లారు. ఇరువైపులా వాదనలు విన్న అనంతరం.. పార్టీ మారిన ఎమ్మెల్యేలను తక్షణమే అనర్హులుగా ప్రకటించాలని స్పీకర్ కు ఆదేశాలు జారీ చేస్తూ హైకోర్ట్ సింగిల్ జడ్జ్ తీర్పునిచ్చారు. సింగిల్ జడ్జి తీర్పుపై అభ్యంతరం తెలుపుతూ.. శాసనసభ సెక్రెటరీ హైకోర్ట్ ప్రత్యేక బెంచ్ కి అప్పీల్ చేయగా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై ఎప్పుడైనా చర్యలు తీసుకునే అధికారం స్పీకర్ కు ఉందని, నిర్ణీత గడువు ఏమీ లేదని తీర్పు ఇచ్చింది. కాగా ఇప్పటి వరకు స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై సుప్రీంలో రెండు పిటిషన్లు దాఖలు చేశారు.. కారు గుర్తుపై గెలిచి హస్తం పార్టీలో చేరిన 10మందిని అనర్హులుగా ప్రకటించాలని ఈ పిటిషన్ లో కోరారు.

# బాలీవుడ్ నవాబ్ సైఫ్ అలీ ఖాన్

**రూ.1200కోట్లకు పైనే ఆస్తులు.. ఆస్తుల వివాదాలే.. దాడికి కారణమా?.. ముంబైలో కలకలం**

**మెగాస్టార్, ఎన్టీఆర్ సహా పలువురు ప్రముఖుల ఆరా.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**



**మహా:** బాలీవుడ్ స్టార్ హీరో సైఫ్ అలీ ఖాన్ పై దాడి వ్యవహారం భారతీయ చిత్ర పరిశ్రమలో సంచలనంగా మారింది. సైఫ్ పై హత్యాప్రయత్నం చేశారనే వార్తలు హాట్ టాపిక్ గా మారాయి. హీరో సైఫ్ అలీ ఖాన్ పై ఓ దుండగుడు కత్తితో దాడి చెయ్యడంతో ఆయనకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతోప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దుండగులు ఆరుసార్లు సైఫ్ ను కత్తితో పొడవడంతో వెన్నెముకలో కత్తి దిగింది. సర్జరీ చేసి కత్తిని తొలగించినట్టు తాజాగా విడుదల చేసిన హెల్త్ బులిటెన్ లో వైద్యులు పేర్కొన్నారు. ఆ రిపోర్ట్ ప్రకారం సైఫ్ అలీ ఖాన్ ను పెద్ద ప్రమాదం తప్పింది. ఆయన ప్రాణాలతో బయట పడ్డారు. ఇక ఈ దాడిని ఎవరు చేశారు? ఎందుకు చేశారు? అనే విషయం పై పోలీసులు విచారణ జరుగుపుతున్నారు.. అయితే ఈ విషయం పక్కన పెడితే ఇప్పుడు మరో విషయం హాట్ టాపిక్ అవుతుంది. కాగా సైఫ్ కు వేల కోట్ల ఆస్తులు ఉన్నాయి.. ఆస్తుల కోసమే గొడవలు జరుగుతున్నాయా అని చర్చ నడుస్తుంది. ఆయన భార్య కరీనాకపూర్.

**ఫ్యామిలీనా.. పర్సనలా?**

బాలీవుడ్ సీనియర్ హీరో సైఫ్ అలీఖాన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఎన్నో వందల సినిమాలతో ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నాడు. ఆయన సినిమాల పరంగానే కాదు.. పలు వాణిజ్య ప్రకటనలలో కనిపిస్తూ అందరికి దగ్గరయ్యారు. బాలీవుడ్ స్టార్ హీరో సైఫ్ అలీ ఖాన్ ఒక రాజ కుటుంబానికి చెందిన వ్యక్తి.. నవాబుల కుటుంబం నుంచి ఆయన ఇండస్ట్రీకి పరిచయం అయ్యారు. తండ్రి పేరు మన్సూర్ అలీఖాన్ పటౌడీ.. ఆయన తండ్రి మాజీ క్రికెట్ ఆటగాడు. ఎన్నో మ్యాచ్ లలో ఆడి తన సత్తా నిరూపించుకున్నాడు. ఇండియా తరపున స్టార్ క్రికెటర్స్ లో ఈయన ఒకరని చెప్పాలి.. తల్లి షర్మిలా ఠాగోర్.. ఒక బాలీవుడ్ నటి.. హిందీలో పలు చిత్రాల్లో హీరోయిన్ గా నటించిన ఆమెను సైఫ్ తండ్రి మన్సూర్ అలీఖాన్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు.. తండ్రి అంటే సైఫ్ కు చాలా ప్రేమ. అయినా కోసమని సైఫ్ కరీనా ఒక క్రికెట్ టీం ని కొనుగోలు చేశారు. 2024లో మార్చిలో జరిగిన లీగ్ వారి జట్టు విజయం సాధించి చాంపియన్ గా నిలిచింది.. సైఫ్ సినిమాలే కాకుండా పలు వ్యాపారాల్లో కూడా డబ్బులు ఇన్వెస్ట్ చేసి కోట్లల్లో లాభాలను పొందాడు. ఇక ఈయనకు వారసత్వంగా వస్తున్న ఆస్తులు 1200 కోట్ల వరకు ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు.. ఎనిమిది వందల కోట్ల విలువచేసే ఖరీదైన ప్యాలెస్ కూడా ఈయనకు ఉంది. సినిమాల్లో సంపాదించింది పలు వ్యాపారంలో సంపాదించింది కలిపి మొత్తం 2, 3 వేల కోట్లకు పైగా ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు.. అటు సైఫ్ భార్య కరీనాకపూర్ కూడా సినిమాలతో బాగానే సంపాదించింది.. తెలిసినవి కొన్ని ఆస్తులు అయితే తెలియనివి చాలా ఉంటాయని ఆయన సన్నిహితులు కూడా చెప్తున్నారు. మొత్తానికి సైఫ్ అలీ ఖాన్ వేలకోట్లకు అధిపతి అని తెలుస్తుంది.. ప్రస్తుతం ఆయనపై ఎవరు దాడి చేశారన్న విషయం చర్చనీయాంశంగా మారింది. ఇది కావాలని చేశారా లేదా ఎవరైనా దుండగులు చేశారన్న విషయం తెలియాల్సి ఉంది. అయితే తాజాగా దుండగుడి దాడా.. అనుకోకుండా జరిగిందా? ప్రిప్లానా అన్నది తేలాల్సి ఉంది. మరోవైపు సైఫ్ కత్తిపోట్ల సంఘటన తెలుసుకుని మెగాస్టార్ చిరంజీవి, జూనియన్ ఎన్టీఆర్ షాక్ కు గురయ్యారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## ఈ కార్ రేసు కేసులో ఏసీబీ దూకుడు

**ఏస్ నెక్ట్స్ జెన్ కంపెనీకి నోటీసులు.. రేపు విచారణకు రావాలని ఆదేశం**




**హైదరాబాద్, మహా :** ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసు వ్యవహారంలో విచారణ జరుపుతున్న ఏసీబీ దూకుడు పెంచింది. ఫార్ములా ఈ కార్ రేస్ తొలి ప్రమోటర్‌గా ఏస్ నెక్ట్స్ జెన్ కంపెనీకి ఏసీబీ నోటీసులు జారీ చేసింది. ఫార్ములా ఈ రేసును నిర్వహించేందుకు ఒప్పందం చేసుకుని ఉన్నట్టుండి ఏస్ నెక్ట్స్ అనే కంపెనీ ఆ ఒప్పందం నుంచి అప్పట్లోనే వైదొలగింది. మొదట ఒప్పందం కుదుర్చుకుని ఎందుకు తప్పుకున్నారన్న అంశంపై విచారించేందుకు నిర్ణయించిన ఏసీబీ జనవరి 18న విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో ఏసీబీ స్పష్టం చేసింది. కాగా, ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో ఇప్పటికే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, హెచ్ఎండీఏ పూర్వ కమిషనర్ అరవింద్ కుమార్, హెచ్ఎండీఏ ఇంజినీర్ ఇన్ చీఫ్ బీఎల్ఎన్ రెడ్డిలను ఏసీబీ అధికారులు ఇప్పటికే విచారించారు. 2022 అక్టోబరు 25న జరిగిన తొలి ఒప్పందం ప్రకారం సీజన్ 9 తోపాటు 10, 11, 12 రేస్‌ల నిర్వహణ ఖర్చులను ఏస్ నెక్ట్స్ జెన్ భరిస్తామని పేర్కొంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో 2023 ఫిబ్రవరి 10, 11 తేదీల్లో సీజన్9 ఫార్ములా ఈరేస్ జరిగింది. అనంతరం 2024 ఫిబ్రవరిలో జరగాల్సిన సీజన్10 రేస్ కోసం ఫార్ములాఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో) సంస్థకు 2023 మేలోనే 50 శాతం సొమ్ము అంటే రూ.90 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఏస్ నెక్ట్స్‌జెన్ కంపెనీ ముందుకు రాలేదు. అంతేగాక, సీజన్9 ఫార్ములా ఈరేసు నిర్వాహణతో తమకు భారీగా నష్టం వాటిల్లిందంటూ ఏస్ నెక్ట్స్ జెన్ కంపెనీ వైదొలిగింది. దీంతో ప్రమోటర్‌గా హెచ్ఎండీఏ నే పోషించాలని అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో 2023 అక్టోబరు 5, 11 తేదీల్లో రూ.45.71 కోట్లను ఎఫ్ఈవోకు హెచ్ఎండీఏ నేరుగా బదిలీ చేసింది. ఈ వ్యవహారమే ఇప్పుడు ఈ ఏసీబీ విచారణకు కారణమైంది. రేస్ నిర్వహణ బాధ్యత నుంచి తప్పుకొన్న ఏస్ నెక్ట్స్ జెన్ కంపెనీపై అప్పటి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపైనా ఏసీబీ సమగ్రంగా విచారణ జరుపుతోంది. ఈ క్రమంలోనే ఆ కంపెనీని విచారణకు రావాలంటూ నోటీసులు జారీ చేసింది. కంపనీ పూర్వపరాలతో పాటు ఒప్పందం రద్దు చేసుకునేందుకు కారణం తెలుసుకోవడంతో పాటు అప్పట్లో తెలంగాణ ప్రభుత్వంతో జరిగిన అగ్రిమెంట్ ఏమిటన్న అంశాలను కూడా ఏసీబీ రాబట్టే అవకాశాలున్నాయి.

## ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛత దినముగా పాటించాలి

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్**

**పరిశుభ్రమైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దండి**

**మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ**




**కర్నూలు , మహా :** రాష్ట్రంలో ప్రతినెల మూడవ శనివారం స్వచ్ఛత దినముగా పాటించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్లకు వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించి ఆదేశించారు. గురువారం సాయంకాలం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ విజయవాడ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించి , ఇప్పటి నుండి ప్రతి మూడవ శనివారం అనగా ఈనెల 18 వ తారీకు నుండి రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలో , అన్ని గ్రామాలలో , అన్ని పాఠశాలలో , అన్ని కళాశాలలు , అన్ని ప్రదేశాలలో స్వచ్ఛత దినముగా పాటించాలని అందుకు కావలసిన చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్పొరేషన్ జారీ చేసే మార్గదర్శకాలు మేరకు స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించాలని ప్రతినెల మూడో శనివారం ఒక థీమ్ ప్రకారం స్వచ్ఛత కార్యక్రమాలు చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అందులో భాగంగా స్వచ్ఛతా కార్యక్రమాలు చేయాలని, రాష్ట్రంలో రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రదేశాలు పరిశుభ్రం చేసే చర్యలు తీసుకోవాలని సూచించారు. చేసిన కార్యక్రమాలు అన్నిటిని డిజిటల్ ప్లాట్ ఫామ్ కు అప్లోడ్ చేయాలని ఆ విధంగా చేసిన వాటిని పరిశీలించి బాగా పనిచేసిన కార్యక్రమాలకు రేటింగ్ ఇచ్చి ప్రోత్సాహాలు ఇస్తామని ప్రధాన కార్యదర్శి తెలియజేశారు. మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ ఈ సందర్భంగా మాట్లాడుతూ... 175 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఉన్న ప్రజా ప్రతినిధులను ఈ స్వచ్ఛత కార్యక్రమంలో భాగస్వామ్యం చేసి ర్యాలీలు ,మానవహారాలు నిర్వహించి తద్వారా ప్రజలలో స్వచ్ఛతపై పూర్తి అవగాహన కల్పించే చర్యలు చేపట్టాలని , రాష్ట్రాన్ని దేశంలోనే పరిశుభ్రమైన రాష్ట్రంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ప్రతి ఇంటికి వెళ్లి చెత్త సేకరించే చర్యలు చేస్తూ అక్కడే చెత్తను వేరు చేసే చర్యలు తీసుకుంటామని , చెట్ల పొదలు నిర్మూలన , ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రం చేసే చర్యలు , కాలువలు రోడ్లు శుభ్రపరిచే చర్యలు ఒక డ్రైవ్ రూపంలో మొదలగు కార్యక్రమాలు చేపడతామని ప్రధాన కార్యదర్శి కి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి అసిస్టెంట్ కలెక్టర్ చెల్లా కళ్యాణి , జడ్పీ సీఈఓ నాసర రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు , జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్సీ నాగేశ్వరరావు , డ్వామా పీడి వెంకట రమణయ్య హాజరయ్యారు.

# తెలుగులోనే జీవోలు

**రుణమాఫీ, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డుల జీవోలు మాతృభాషలోనే..**

**ప్రధాన ఉత్తర్వులన్నీ తెలుగులో ఇస్తున్న సర్కార్**

**భవిష్యత్‌లోనూ ఉత్తర్వులన్నీ తెలుగులో ఇచ్చేలా ఏర్పాట్లు**



**హైదరాబాద్, మహా :** రాష్ట్ర ప్రభుత్వం కొత్త సంప్రదాయానికి తెరతీసింది. ఇన్నాళ్లూ ప్రభుత్వ జీవోలన్నీ ఇంగ్లీష్ లోనే వచ్చేవి. కానీ, ఇటీవల సామాన్యులకు అర్థమయ్యేలా పలు జీవోలను సర్కారు తెలుగులో ఇస్తోంది. గతేడాది రుణమాఫీ జీవోను రాష్ట్ర ప్రభుత్వం తెలుగులో ఇచ్చింది. దీనిపై తెలుగు భాషాభిమానులతో పాటు సామాన్యుల్లో హర్షం వ్యక్తమైంది. అప్పటి నుంచి ప్రజలకి నేరుగా సంబంధం ఉన్న జీవోలన్నింటిని ఆయా శాఖలు తెలుగులోనే ఇచ్చే ప్రయత్నం చేస్తున్నాయి. వ్యవసాయ శాఖ నుంచి ఇటీవల రైతు భరోసా అమలు మార్గదర్శకాల జీవో కూడా తెలుగులోనే వచ్చింది. కొత్త రేషన్ కార్డుల జారీకి ఇచ్చిన ఉత్తర్వులు కూడా తెలుగులో స్పష్టంగా ఉన్నాయి. ఇతర శాఖల్లోనూ ముఖ్యమైన జీవోలను దశల వారీగా తెలుగులోనే ఇచ్చేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలు, నిబంధనలు, సూచనలు ప్రజలకు తేలికగా అర్థమయ్యేందుకు ఇంగ్లిష్‌తో పాటు తెలుగులోనూ ఉత్తర్వులు జారీ చేయాలని అన్ని శాఖలను ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ విషయంలోతమిళనాడును అనుకరించాలని సూచించారు.

**ఆ జీవోకు 44 ఏండ్లు**

ప్రభుత్వ జీవోలు తెలుగులోనే ఇవ్వాలంటూ ఉమ్మడి ఏపీ ప్రభుత్వం1980లోనే ఓ జీవో ఇచ్చింది. కొన్నిశాఖల్లో కొంతకాలం అమలు చేసినప్పటికీ తర్వాత ఎందుకనో పక్కనపెట్టేశారు. ఫలితంగా ఇన్నేండ్లలో ఒకటి, అరా మినహా అన్ని జీవోలు ఇంగ్లిష్లోనే వచ్చాయి. దీంతో ఈ జీవోలను అర్థం చేసుకోవడం సామాన్యులకు కష్టసాధ్యమయ్యేది. ఇలాంటి జీవోలను ప్రజాప్రతినిధులు సైతం సరిగ్గా అర్థం చేసుకోలేక ఇబ్బందులపాలైన సందర్భాలు ఉన్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ జీవోలన్నీ తెలుగులో ఇచ్చేందుకు ప్రయత్నిస్తామని తెలుగు, మాతృభాషా దినోత్సవాల సందర్భంగా గత ప్రభుత్వ పెద్దలు చెప్పారే తప్ప అమలుచేయలేదు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ దిశగా గట్టి ప్రయత్నాలు జరుగుతున్నాయి. తమ ప్రజాప్రభుత్వంలో జీవోల విషయంలో పూర్తి పారదర్శకత పాటిస్తామని, పబ్లిక్డొమైన్లో పెడ్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కారు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నది. ప్రతి ఒక్కరికీ సులువుగా అర్థమయ్యే రీతిలో ముఖ్యమైన జీవోలను తెలుగులో ఇస్తున్నది. ఇటీవల రైతుభరోసా, రేషన్కార్డుల మార్గదర్శకాలపై ఇచ్చిన జీవోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. కాగా, ఈ జీవోలను తెలుగులోకి అనువాదించే బాధ్యతలను 'డైరెక్టర్ ఆఫ్ ట్రాన్స్‌లేషన్స్'కు ప్రభుత్వం అప్పగించినట్లు తెలిసింది.



## నైటా బోనాలకు మంత్రి సీతక్కకు ఆహ్వానం

**నైటా నూతన అధ్యక్షురాలిగా ఎంపికైన వాణి ఏనుగును అభినందించిన మంత్రి**

**హైదరాబాద్, మహా:** న్యూయార్క్ తెలంగాణ తెలుగు సంఘం (నైటా) కొత్త అధ్యక్షురాలిగా ఎంపికైన వాణి ఏనుగును పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అభినందించారు. అమెరికా ప్రధాన నగరమైన న్యూయార్క్ లో తెలుగువారికి ఓ సంఘం ఏర్పాటు చేయటంతో పాటు, తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను కొనసాగించేందుకు నైటా చేస్తున్న కృషిని మంత్రి సీతక్క అభినందించారు. హైదరాబాద్ లో మంత్రి నివాసంలో జరిగిన కార్యక్రమంలో నైటా కొత్త కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. మహిళా శక్తికి ఆదర్శంగా నిలిచి, నైటా సేవలను మరింత విస్తృత పరచాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. వాణి ఏనుగుతో పాటు కుటుంబ సభ్యులను సన్మానించారు. రానున్న జూన్ లో నైటా తరపున న్యూయార్క్ లో జరిగే బోనాల ఉత్సవాలకు ముఖ్యఅతిధిగా హాజరుకావాలని మంత్రిని నైటా కార్యవర్గం ఆహ్వానించింది. ఇందుకు మంత్రి సీతక్క సుముఖత వ్యక్తం చేశారు.



## హామీలతోనే కాంగ్రెస్ ఓటమి

**ఢిల్లీ గ్యారంటీలపై కేంద్రమంత్రి బండి సంజయ్ ధ్వజం**

**ఢిల్లీ, మహా:** తెలంగాణలో ఇచ్చిన మోసపూరిత హామీలతో కాంగ్రెస్ పార్టీ గతంలో హర్యానా, మహారాష్ట్రలలోనూ ఎన్నికలకు వెళ్లి ఓటమి చవిచూసిందని, ఇప్పుడు ఢిల్లీలోనూ ఆ పార్టీకి ఓటమి తప్పదని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ హామీల ప్రచార పోస్టర్‌ను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. ఈ పోస్టర్ విడుదలపై బండి సంజయ్ స్పందించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలే ఆ పార్టీ ఓటమికి టిక్కెట్ అని ఎద్దేవా చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ మోసపూరిత హామీలను ఇచ్చిందని, వాటిని అమలు చేయలేదన్నారు. ఆ హామీలను చూపిస్తూ హర్యానా, మహారాష్ట్ర ఎన్నికలకు వెళ్లి ఓడిపోయారని విమర్శించారు. ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ రేవంత్ రెడ్డి ఇచ్చిన ఘనమైన హామీలు తెలంగాణలో ఇచ్చిన హామీల మాదిరిగా విఫలం కావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ బూటకపు ప్రచారాలు, బూటకపు హామీలతో ఢిల్లీ తప్పుదోవ పట్టదన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల రూపంలో మరో ఓటమి ఎదురు చూస్తోందన్నారు.

## అభివృద్ధి పనులకు తక్షణం అనుమతులు ఇవ్వండి

**కేంద్రమంత్రులను కోరిన సీఎం రేవంత్ రెడ్డి**

**38 ప్రాజెక్టులకు అనుమతుల పెండింగ్**



**ఢిల్లీ, మహా:** ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం పలువురు కేంద్రమంత్రులను కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. గురువారం ఢిల్లీలోని ఇందిరా పర్యావరణ్ భవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్.. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌ను కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను నివేదించారు. తెలంగాణలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు అటవీ, పర్యావరణ శాఖ వెంటనే అనుమతులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్‌కి విజ్ఞప్తి చేశారు. కేంద్ర అటవీ శాఖ అనుమతులు రాకపోవడంతో తెలంగాణ వ్యాప్తంగా 161 ప్రాజెక్టులు నిలిచిపోయాయని వివరించారు. 38 ప్రాజెక్టులకు వన్యప్రాణి సంరక్షణ చట్టాల పరమైన అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణం అనుమతులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ ప్రాజెక్టుల్లో అత్యధికం రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలు, వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నాయని కేంద్ర మంత్రికి తెలియజేశారు. అనుమతులు రాకపోవడంతో జాతీయ రహదారులు, ఏజెన్సీ ప్రాంతాల్లో టవర్ల నిర్మాణం, పీఎంజీఎస్‌వై, పొరుగు రాష్ట్రాలను అనుసంధానించే రహదారుల నిర్మాణ పనులు నిలిచిపోయాయని సీఎం రేవంత్ తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన అనుమతుల మంజూరు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్ వెంట మంత్రులు కొండా సురేఖ గారు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ పోరిక బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.



## విశాఖ అల్లుడికి గోదావరి రుచులు


**250 రకాల వంటకాలతో ఆతిథ్యం**

**విశాఖ, మహా :** విశాఖ నుండి తూర్పుగోదావరి జిల్లా కు వెళ్లిన కొత్త అల్లుడి కి250 రకాల వంటకాలతో ఆతిథ్యం ఇచ్చిగోదవారోళ్ళ మజాకా అనిపించుకున్నారు.ఇంటికొచ్చిన కొత్త అల్లుడికి పదుల సంఖ్యలో వంటకాలతో విందు పెట్టడంలో గోదావరి వాసులు తరువాతే ఎవ్వరైనా అని చెప్పాలి.సంక్రాంతి కి వచ్చిన విశాఖ కు చెందిన వైసిపి రాష్ట అధికార ప్రతినిధి యూత్ నాయకుకుడు కొండా రాజీవ్ కు కొత్త అల్లుడి హోదాలో కాకినాడ కు చెందిన అత్త మామలు వందలాది వంటకాలు వడ్డించటం చర్చనీయాంశం గా మారింది అత్తగారింట్లో కొండా రాజీవ్ గాంధీ కి భారీ విందు ఏర్పాటు చేసారు.250 రకాలతో సంక్రాంతి కొత్త అల్లుడికి అతిధ్యం ఇచ్చిన గోదావరి అత్తమామలు అందరిని అబ్బుర పరిచారు. కాకినాడ నగరం గాంధీనగర్ లో ఈ వేడుకులకు వేదిక అయింది.విశాఖ అల్లుడు రాజీవ్ ఆ ఆనందాన్ని మహా పత్రిక తో పంచుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా లో ఒక ఇంటికి అల్లుడు కావడం సంక్రాంతి కి వెళ్లడం సంతోషకర విషయమన్నారు. సంక్రాంతి కి వారు చేసే మర్యాదలు ,ఆతిధ్యం మరువలేనివి అని గుర్తుచేసుకున్నారు.

## రేవు పోలవరం సముద్ర తీరంలో ఇద్దరు మృతి



మృతుడు మణికంఠ (ఫైల్)




మృతుడు సాద్విక్ (ఫైల్)

అనకాపల్లిజిల్లా ,ఎస్ .రాయవరం మండలం, రేవుపోలవరం తీరంలో ఇద్దరు మృతి చెందిన సంఘటన పండుగ లో విషాదం మిగిల్చింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒక బాలుడు అలల్లో మునిగిపోవడంతో వారికి బావ వరుస అయిన మరో యువకుడు కాపాడే ప్రయత్నం చేసిన యువకుడు గల్లంతయ్యాడు. ఆ బాలుడు మృతదేహం రేవుపోలవరం తీరంలో లభ్యం కాగా మరో మృతదేహం నక్కపల్లి మండలం తీనార్ల తీరం వద్ద లభ్యమయ్యింది. ఈ సందర్భంగా. నక్కపల్లి అడ్డురోడ్డు సర్కిల్ ఇన్స్పెక్టర్ లడ్డు రామకృష్ణ మీడియా తో మాట్లాడుతూ కనుమ పండుగ సంధర్భంగా పర్యాటక కేంద్రం రేవుపోలవరం తీరప్రాంతానికి జనం అధిక సంఖ్యలో తరలివెళ్లారన్నారు. దీనిలో భాగంగా కాకినాడ జిల్లా, తుని మండలం, లోవకొత్తూరు గ్రామానికి చెందిన కొన్ని కుటుంబాల నుండి సుమారు 30 మంది సరదాగా రేవుపోలవరం తీరానికి వెళ్లారని వారిలో సముద్రంలో స్నానానికి దిగిన పనసబోయిన సాద్విక్ (10) అలల ఉధృతికి లోపలికి కొట్టుకొని పోతుండగా, తనని రక్షించేందుకు కాకర మణికంఠ (18) వెళ్ళి అలల ఉధృతికి లోపలికి వెళ్ళిపోయినట్లు తెలిపారు. కొద్దిసేపటికి సాద్విక్ అలల మధ్య కనిపించగా స్థానిక మత్స్యకార యువకులు బైటకు తీసి ప్రాణాలు కాపాడేందుకు శతవిధాలా ప్రయత్నించారు. పండుగ పూట ఆనందంగా గడిపేందుకు వచ్చిన కుటుంబంలో ఇద్దరిని కోల్పోవడంతో కన్న తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారని తెలియజేసారు. పండుగ సందర్భంగా ఆనందంగా గడుపుదామని తీరం కు వెళ్లి ఇద్దరు మృత్యువాత పడటం బాధాకర విషయమన్నారు. ప్రమాద వార్త తెలుసుకున్న మా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గల్లంతయిన యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రింగ్ రోడ్డు సమీపంలోని భూములపై మంత్రి కన్ను

**రాయించుకునే ప్రయత్నం చేస్తున్నారు.. ఎంపీ రఘునందన్ రావు ఆరోపణ**

**మూడు తరాలుగా అక్కడే ఉంటున్న గిరిజనులకు పట్టాలు ఇవ్వాలన్న ఎంపీ**




**హైదరాబాద్, మహా:** రింగ్ రోడ్డు సమీపంలోని 85 ఎకరాల భూమిని ఓ మంత్రి తన కుటుంబసభ్యుల పేరు మీద రాయించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. గురువారం ఆయన నాంపల్లి పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చేతనైతే మూడు తరాలుగా అక్కడే ఉంటున్న గిరిజన రైతులకు పట్టాలు ఇప్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రాపురం మండలం, శంకర్‌పల్లి మండలం మధ్య చాలా కాలంగా భూవివాదం నడుస్తోందని శంకర్‌పల్లిలోని కొండకల్, రామచంద్రాపురంలోని వెలిమెల గ్రామాల మధ్య మిగిలిన దాదాపు రూ.1,500కోట్ల విలువైన 85 ఎకరాలను కబ్జా చేసేందుకు ప్రజలపై దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల భూములను కాపాడేందుకే ధరణి స్థానంలో భూమాత చట్టాన్ని తెచ్చామని అసెంబ్లీలో ఉపన్యాసాలు ఇచ్చిన మంత్రి ఇప్పుడు పేద ప్రజల భూములను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. పేదలకు జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నిస్తే పోలీసులను అడ్డు పెట్టుకొని బెదిరిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని పెద్దలు కొంతమంది హైదరాబాద్ రింగ్ రోడ్డు చుట్టూ ఉన్న పేదల ఖాళీ స్థలాలను, భూములను లాక్కుంటున్నారని ఆరోపించారు.

NATIONAL TESTING AGENCY

## ఎన్టీఏ సంచలన నిర్ణయం

**మహా:** ఎంబీబీఎస్ సహా యూజీవైద్య విద్యాకోర్సుల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే నీట్ పై జాతీయ పరీక్షా సంస్థ (ఎన్టీఏ) సంచలన ప్రకటన చేసింది. సింగిల్ డే - సింగిల్ షిఫ్ట్‌లో పెన్ పేపర్ మోడ్ (ఓఎంఆర్ బేస్డ్) లో నీట్ పరీక్ష నిర్వహిస్తామని తెలిపింది. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ఖరారు చేసిన మార్గదర్శకాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నది. ఎంబీబీఎస్‌తోపాటు బీడీఎంఎస్, బీయూఎంఎస్, బీఎస్ఎంఎస్ కోర్సులకు యూనిఫామ్ నీట్ (యూజీ) పరీక్ష నిర్వహిస్తామని ఎన్టీఏ తెలిపింది. నీట్ (యూజీ) ఫలితాల ఆధారంగా నేషనల్ కమిషన్ ఫర్ హోమియోపతి కింద బీహెచ్ఎంఎస్ కోర్సు అడ్మిషన్లు నిర్వహిస్తారు. దీంతోపాటు ఆర్మ్‌డ్ మెడికల్ సర్వీస్ హాస్పిటల్స్‌లో బీఎస్సీ నర్సింగ్ కోర్సు అడ్మిషన్లకు నీట్ (యూజీ) క్వాలిఫై కావాల్సి ఉంటుంది. నాలుగేండ్ల బీఎస్సీ నర్సింగ్ కోర్సుకు కూడా నీట్ (యూజీ) కోర్సులో అర్హత సాధించాల్సి ఉంటుందని ఎన్టీఏ తెలిపింది.

## గోవాడ చక్కెర కర్మాగారాన్ని భ్రష్టు పట్టించారు

**కర్మాగారం రైతులు, కార్మికుల ఆందోళన**

**జీతాల కోసం రోడ్డెక్కిన కార్మికులు.. ఎండీ గో బ్యాక్ అంటూ నినాదాలు**



**అనకాపల్లి జిల్లా ,చోడవరం , మహా :** అనకాపల్లి జిల్లా చోడవరం మండలం గోవాడ షుగర్ ఫ్యాక్టరీ ఎండి సన్యాసినాయుడు ఈ 5 సంవత్సరాలలో షుగర్ ఫ్యాక్టరీని, రైతుల్ని కార్మికుల్ని భ్రష్టు పట్టించారని కార్మికులు ఆరోపించారు. చక్కెర కర్మాగారంలో గత నాలుగు నెలలుగా కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంతో షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు గురువారం పరిశ్రమ ఎదుట రోడ్డుపైకి వచ్చి అర్ధనగ్న ప్రదర్శన చేశారు. షుగర్ ఫ్యాక్టరీ ఎండి గో బ్యాక్ అంటూ కార్మికుల నినాదాలు చేశారు.ఫ్యాక్టరీలో కార్మికుల జీతాలు, బకాయిలు చెల్లించకపోతే విధులకు వెళ్ళే పరిస్థితి లేదని తేల్చి చెప్పారు. అనకాపల్లి జిల్లా చోడవరం మండలం గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో సభ్యులకు చెల్లించాల్సిన కోట్ల బకాయిలు దసరా నాటికి చెల్లిస్తామని చెప్పి ఎండి మాట ఇచ్చారని, సంక్రాంతి పండగ నాడు కూడా కార్మికులను పస్తులించారని కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. చక్కెర కర్మాగారం ఎం.డి.మాటలు నీటి మూటలు గామారిపోయాయని యూనియన్ నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా కార్మిక సంఘం భాస్కర్ రావు మాట్లాడుతూ.. ఈ సీజన్ క్రసింగ్ ప్రారంభించడానికి కాని రైతులకు కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించేందుకు ఎటువంటి ప్రయత్నాలు జరగలేదన్నారు. సంక్రాంతి పండుగకు చెల్లిస్తామని చెప్పి ఇప్పటివరకు ఎటువంటి జీతాలు చెల్లింపులు చేయలేదని పండగ పూట కూడా కార్మికులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం ఫ్యాక్టరీ యాజమాన్యం ఫ్యాక్టరీకి ఈ పరిస్థితికి తీసుకొచ్చారని ఆరోపించారు ప్రభుత్వం ,పరిశ్రమ యాజమాన్యం వెంటనే స్పందించి కార్మికులకు జీతాలు చెల్లించాలని ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు ,కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



EDITORIAL ఎడిటోరియల్

# ఎన్నికల దిశగా బంగ్లాదేశ్



బంగ్లాదేశ్ మళ్ళీ ఎన్నికల దిశగా సాగుతోంది. బంగ్లాదేశ్లో విద్యార్థులు చేపట్టిన సామూహిక ఆందోళన హింసాత్మకంగా మారిన తరువాత షేక్ హసీనా దేశం విడిచి వెళ్లిపోగా, యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. దీనితో యూనస్ సర్కార్ రాజ్యాంగ సంస్కరణల కమిషన్ ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ అనేక సిఫార్సులు చేస్తుండగా, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ ఈ ఏడాది జులైఆగస్టుల్లో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తోంది. ప్రాథమిక సంస్కరణలు చేసిన తరువాత ఈ సంవత్సరాంతానికి లేదా 2026 మధ్యలో ఎన్నికలు నిర్వహించాలని యూనస్ భావించారు. అయితే దీనిపై అక్కడ వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఎన్నికల దిశగా ఒత్తిడి పెరుగుతోంది. దీనితో త్వరలోనే బంగ్లాలో ఎన్నికలు జరిగే పరిస్థితులు నెలకొంటున్నాయి. యూనస్ నియమించిన రాజ్యాంగ కమిషన్ దేశంలో ద్విసభ పార్లమెంట్ను ఏర్పాటు చేయాలని, అలాగే ప్రధాని పదవికి రెండుసార్లు మాత్రమే నిర్వహించాలన్న నిబంధన ఉండాలని ప్రతిపాదించింది. అంటే బంగ్లాదేశ్ ప్రధాని పదవిని ఎవరైనా కేవలం రెండు సార్లు మాత్రమే చేపట్టడానికి అవకాశం ఉండాలని సూచించింది. బంగ్లాదేశ్ రాజ్యాంగ ప్రవేశికలో లౌకికవాదం, సోషలిజం, జాతీయవాదం, ప్రజాస్వామ్యం అనే 4 ప్రాథమిక భావనలు ఉన్నాయి. వీటిలో మొదటి మూడింటిని తొలగించాలని కమిషన్ సూచించింది. కేవలం 'ప్రజాస్వామ్యం' అనే పదం మాత్రమే రాజ్యాంగ ప్రవేశికలో ఉంచాలని పేర్కొంది. "1971 విముక్తి యుద్ధం ఆదర్శాలను, అలాగే 2024 సామూహిక తిరుగుబాటుకు కారణమైన ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే విధంగా మేము 5 కొత్త సూత్రాలను ప్రతిపాదిస్తున్నాం. సమానత్వం, గౌరవం, సామాజిక న్యాయం, బహుళత్వం , ప్రజాస్వామ్యం" అని రాజ్యాంగ సంస్కరణల కమిషన్ ఛైర్మన్ అలీ రియాజ్ తెలిపారు. ఇక బంగ్లాదేశ్లో రెండు సభలతో పార్లమెంట్ను ఏర్పాటు చేయాలని రాజ్యాంగ సంస్కరణల కమిషన్ సూచించింది. 105 సీట్లతో నేషనల్ అసెంబ్లీ దిగువ సభ, 405 సీట్లతో ఎగువ సభను ఏర్పాటు చేయాలని పేర్కొంది. అంతేకాదు ప్రస్తుతమున్న ఐదేళ్ల కాలపరిమితి కాకుండా, ఇకపై పార్లమెంట్ పదవీకాలం 4 సంవత్సరాలకు కుదించాలని నివేదిక సూచించింది. దిగువ సభ మెజారిటీ ప్రాతినిథ్యంపై, ఎగువ సభ దామాషా ప్రాతిపదికపై ఏర్పాటు కావాలని కమిషన్ ప్రతిపాదించింది. అలాగే ఇకపై ఎవరైనా రెండు సార్లకు మించి ప్రధాని పదవి చేపట్టకుండా పరిమితి విధించాలని సూచించింది. అలాగే జాతీయ రాజ్యాంగ మండలిని ఏర్పాటు చేయాలని, ఇందులో దేశాధ్యక్షుడు, ప్రధాన న్యాయమూర్తి, ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేతలు , ఉభయ సభలు స్పీకర్లు, ప్రతిపక్షం నుంచి డిప్యూటీ స్పీకర్లు, ఇతర పార్టీల ప్రతినిధులు ఉండాలని సూచించింది. ఈ రాజ్యాంగ సంస్థ పారదర్శకంగా, జవాబుదారీగా పనిచేస్తుందని కమిషన్ పేర్కొంది. బంగ్లాదేశ్ రాజ్యాంగాన్ని సవరించడానికి ప్రజాభిప్రాయ సేకరణ వ్యవస్థను తిరిగి ప్రవేశపెట్టాలని కమిషన్ ప్రతిపాదించింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం, పార్లమెంట్ మూడింట రెండు వంతుల మెజారిటీతో రాజ్యాంగాన్ని సవరించవచ్చు. పాకిస్థాన్ నుంచి విముక్తి పొంది స్వతంత్ర బంగ్లాదేశ్ ఆవిర్భవించిన ఒక సంవత్సరం తరువాత, 1971లో బంగ్లాదేశ్ రాజ్యాంగం ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏకంగా 17 సార్లు దానిని సవరించారు. తాజాగా రాజ్యాంగ కమిషన్ సూచనలు, ప్రజాభిప్రాయ సేకరణలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలతో త్వరలోనే బంగ్లాదేశ్ కుదురుకునే అవకాశాలున్నాయి.

# ముంబై సురక్షితమేనా?




బాలీవుడ్ నటుడు.. పటౌడి వంశ వారసుడు సైఫ్ అలీఖాన్పై దాడి జరిగిన అనంతరం ముంబై సురక్షితం కాదనే ట్రెండ్ మొదలైంది. ఇప్పటికే ముంబైలో మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్ధిఖీని కాల్చి చంపిన లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ అనంతరం కండల వీరుడు సల్మాన్ ఖాన్ చంపేస్తామంటూ వార్నింగ్ ఇచ్చింది. ఇప్పుడు తాజాగా సైఫ్ అలీఖాన్పై కూడా దాడి జరగడంతో సెలబ్రిటీలకే రక్షణ లేకపోతే ఇక సాధారణ ప్రజల పరిస్థితి ఏంటి అని అటు సినీ ప్రముఖులతో పాటు కొందరు ప్రతిపక్ష నేతలు ప్రశ్నిస్తున్నారు. అయితే ఈ వ్యాఖ్యలపై తాజాగా స్పందించారు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్. ఆయన మాట్లాడుతూ.. సైఫ్ అలీఖాన్పై దాడి జరగడం ఆందోళన కలిగించే విషయమే కానీ ఈ విషయం వలన ముంబైని సురక్షితం కాదని అనడం తప్పు. దేశంలోని అన్ని మెగాసిటీల్లో కెల్లా ముంబయి సురక్షితమైనది. అప్పుడప్పుడు ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయనేది వాస్తవమే. వీటిని నిరోధించడానికి అలాగే భద్రతా చర్యలను పెంచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ముంబై పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ద్వారా దాడి చేసిన వ్యక్తిని గుర్తించారు, దర్యాప్తు కొనసాగుతోంది! అంటూ ఫడణవీస్ చెప్పుకొచ్చారు. ఈకేసులో నిందితుడి కోసం క్రైమ్ బ్రాంచ్ పోలీసులు 10 బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. ఓవైపు దర్యాప్తు కొనసాగుతుండగానే.. మరోవైపు సైఫ్ అలీఖాన్ దాడి వెనుక బిష్ణోయ్ గ్యాంగ్ హస్తం ఉందంటూ పెద్ద ఎత్తున వార్తలు వస్తున్నాయి. అయితే వాటిపై తాజాగా పోలీసులు స్పందించారు. ముంబై బాంద్రాలోని సైఫ్ అలీఖాన్ నివాసంలోనే.. గురువారం రోజు తెల్లవారుజామున 2.30 గంటలకు హీరోపై దాడి జరిగింది. సైఫ్, అతడి కుటుంబ సభ్యులు నిద్రలో ఉండగా.. మెట్లమార్గం గుండా ఇంట్లోకి ప్రవేశించిన ఓ దుండగుడిని సిబ్బంది గుర్తించి కేకలు వేయగా.. సైఫ్ అక్కడకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఈక్రమంలోనే నిందితుడు తన వెంట తెచ్చుకున్న కత్తితో హీరోపై దాడికి పాల్పడ్డాడు. మొత్తం ఆరు సార్లు ఇష్టం వచ్చినట్లుగా పొడవగా.. సైఫ్ తీవ్ర గాయాల పాలయ్యాడు. అయితే విషయం గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని లీలావతి ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలోనే లీలావతి ఆస్పత్రి వైద్యులు.. సైఫ్ అలీఖాన్కు మెరుగైన వైద్య చికిత్సలు అందించారు. ముఖ్యంగా వెన్నుపూస భాగంలో ఇరుక్కుపోయిన కత్తి ముక్కను శస్త్ర చికిత్స ద్వారా తొలింగాచు. మొత్తం 2.5 అంగుళాలు ఉన్న ఈ కత్తి ముక్కను తొలగించిన వైద్యులు వెన్నుపూసలో ద్రవాలు లీక్ కాకుండా కూడా చికిత్స చేశారు. అలాగే ఎడమ చేయి, మెడ వద్ద ఉన్న గాయాలకు పాస్టిక్ సర్జరీ చేశారు. ప్రస్తుతం ఐసీయూలో ఉన్న సైఫ్ అలీఖాన్ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు వెల్లడించారు. మరోవైపు ఈ కేసును చాలా సీరియస్గా తీసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని పట్టుకోవడానికి క్రైమ్ బ్రాంచ్ పోలీసులు 10 బృందాలుగా ఏర్పాడారు. మరోవైపు ఎస్కౌంటర్ స్పెషలిస్ట్ దయా నాయక్ కూడా ఈ కేసు దర్యాప్తులో పాల్గొన్నారు. ముఖ్యంగా సైఫ్ అలీఖాన్ ఇంటిని పరిశీలించి.. నిందితుడిని పట్టుకునేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఈయన రాకతో అందరిలోనూ అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా సైఫ్ అలీఖాన్ దాడి వెనుక బిష్ణోయ్ గ్యాంగ్ హస్తం ఉందంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. వరుస సంఘటనలతో సెలబ్రిటీలతో పాటు సామాన్యులు కూడా హడలుతున్నారు. ముంబై సురక్షితమేనా? అన్నది ఇపుడు సోషల్ మీడియాలో ట్రెండింగ్ గా ఉంది. అక్కడి ప్రజలకు, ప్రముఖులకు అభయం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

# కెనడాలోని భారతీయులకు శుభవార్త




భారతీయులకు కెనడా శుభవార్తను అందించింది. కెనడాలోని వేలాది మంది భారతీయులకు ప్రయోజనం కలిగించే నిర్ణయం తీసుకుంది. కెనడా ప్రభుత్వం అంతర్జాతీయ విద్యార్థులు మరియు విదేశీ కార్మికుల జీవిత భాగస్వాముల కోసం ఓపెన్ వర్క్ పర్మిట్ల నిబంధనలను సడలించింది. దీంతో కెనడాలోని వేలాది మంది భారతీయులకు ప్రయోజనం చేకూరబోతుంది. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తన పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన కొన్ని రోజుల తర్వాతే ఈ చర్య తీసుకున్నారు. ముఖ్యంగా 2025 జనవరి 21వ తేదీ నుంచి అర్హత కల్గిన అంతర్జాతీయ విద్యార్థులు, విదేశీ ఉద్యోగుల జీవిత భాగస్వాములు మాత్రమే ఓపెన్ వర్క్ పర్మిట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. నిర్దిష్ట ప్రమాణాలు, 16 నెలలు అంతకంటే ఎక్కువ కాల పరిమితి ఉన్న మాస్టర్స్ సహా అధిక డిమాండ్ ఉన్న ఉద్యోగ రంగాలపై దృష్టి సారించి వాళ్ల కుటుంబీకులకే ఈ సడలింపు వర్తించనుంది. అలాగే విదేశీ కార్మికులపై ఆధారపడిన పిల్లలు మాత్రం ఇందుకు అర్హులు కాదు. అయినప్పటికీ పాత నిబంధనలు ప్రకారం ఆమోదం పొందిన వారు మాత్రం రెన్యూవల్ చేసుకొని దాన్ని కొనసాగించవచ్చు. ఈ మార్పులు భారతీయుల విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చనున్నాయి. ముఖ్యంగా దీని వల్ల చదువుకునే విద్యార్థులతో పాటు ఉద్యోగాలు చేసే వాళ్లంతా తమ భాగస్వాములను వెంట తీసుకెళ్ళకోవచ్చు. కెనడా అంతర్జాతీయ విద్యార్థుల జనాభాలో గణనీయమైన భాగాన్ని కల్గి ఉన్న భారతీయ విద్యార్థులకు ఈ మార్పులు ప్రోత్సాహకరంగా భావిస్తారు. 2023లో కెనడా జారీ చేసిన స్టడీ పర్మిట్లలో దాదాపు 37 శాతం భారతీయ పౌరులు ఉండడంతో.. ఈ కొత్త చర్యల వల్ల వారి భాగస్వాములు సైతం ఉద్యోగాలు చేసుకోవచ్చు. కెనడా ఆర్థిక వ్యవస్థ, కార్మిక శక్తికి ఊతమిచ్చేందుకు ఆ దేశ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. గతేడాది సెప్టెంబర్ నెలలో తాత్కాలిక నివాసితుల సంఖ్య చాలా వరకు తగ్గిందని ఐఆర్ సిసి అంచనా వేసింది.

# ఇజ్రాయెల్, హమాస్ డీల్పై సర్వత్రా హర్షం





శాంతి విరిసింది. ప్రపంచం మురిసింది. కానీ ఆ ఇద్దరి మధ్య క్రెడిట్ గేమ్ మొదలైంది. గాజాలో 15 నెలలుగా ఇజ్రాయెల్హమాస్ సంస్థల మధ్య జరుగుతున్న పోరాటానికి తెరదించే కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఇజ్రాయెల్, హమాస్ మధ్య ఒప్పందం కుదిరిందని తెలియగానే గాజా వాసులు హర్షం వ్యక్తంచేశారు. ఇకనైనా తమ బతుకులు మారతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికాలోని చికాగోలో ఉన్న పాలస్తీనా వాసులు బాణసంచా కాల్చి తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. జోర్డాన్ వాసులు కూడా ఒప్పందం కుదరడంపై హర్షం వ్యక్తం చేస్తూ ప్రదర్శనలు చేశారు. హమాస్తో ఒప్పందానికి ఆమోదం తెలిపి ఇజ్రాయెల్ ప్రభుత్వం అత్యంత కఠినమైన నిర్ణయం తీసుకుందని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియోన్ సార్ చెప్పారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తన చివరి ప్రసంగంలో ఒప్పందం అంశాన్ని ప్రస్తావించారు. గత మే నెలలో తాను ప్రస్తావించిన అంశాలు ఒప్పందంలో ఉన్నాయని చెప్పారు. 8 నెలల చర్చల తర్వాత ఒప్పందం కుదిరిందని వివరించారు. ఈ ఒప్పందం రాజకీయ పరిష్కారానికి దారి చూపతుందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆశాభావం వ్యక్తంచేశారు. రెండు దేశాలుగా పాలస్తీనా, ఇజ్రాయెల్ ప్రజలు పక్కనే పక్కనే శాంతి, సుహృద్భావంతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. గాజాలో కాల్పులవిరమణ ఒప్పందం కీలకమైన ముందడుగుగా జపాన్ అభివర్ణించింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఆస్ట్రేలియా స్వాగతించింది. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వానికి ఒప్పందం దోహదం చేస్తుందని తెలిపింది.

### భారత్ హర్షం

ఇజ్రాయెల్, హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని భారత్ స్వాగతించింది. హర్షం వ్యక్తం చేసింది. బందీలందరినీ విడుదల చేయాలని, కాల్పుల విరమణ పాటించి, చర్చలు, దౌత్యమార్గాల్లో పరిష్కారానికి రావాలని నిరంతరం పిలుపునిచ్చినట్లు భారత విదేశాంగశాఖ తెలిపింది. ఇజ్రాయెల్, హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ స్వాగతించారు. ఈ ఒప్పందాన్ని క్లిష్టమైన తొలిఅడుగుగా ఆయన అభివర్ణించారు. పాలస్తీనియన్లు, ఇజ్రాయిలీలు తమ మెరుగైన భవిష్యత్తుకు, ఒక నమ్మకమైన రాజకీయ పరిష్కారాన్ని కనుగొనేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ఒప్పందానికి మధ్యవర్తిత్వం వహించిన.. ఈజిప్ట్, ఖతార్, అమెరికాలను గుటెర్రెస్ ప్రశంసించారు. పాలస్తీనియన్లకు నిరంతర మానవతాసహాయాన్ని అందించడానికి ఐక్యరాజ్యసమితి సిద్ధంగా ఉందన్నారు. ఖతార్, ఈజిప్ట్, అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, హమాస్ గాజాలో కాల్పుల విరమణ, బందీ విడుదల ఒప్పందానికి ఆమోదం తెలిపాయి. ఖతార్ ప్రధాన మంత్రి, విదేశాంగ మంత్రి కూడా అయిన షేక్ మొహమ్మద్ బిన్ అబ్దుల్ రహమాన్దోహాలో ఈ ఒప్పందం కుదిరిందని బుధవారం ప్రకటించారు. ఒప్పందంలో ప్రారంభదశ 42 రోజులు ఉంటుందని వివరించారు. ఒప్పందం మేరకు 42 రోజులు గాజాలో యుద్ధం ఆగిపోతుంది.

## ట్రంప్, బైడెన్ క్రెడిట్ గేమ్





మరోవైపు, ఆ ఒప్పందం కుదిర్చిన ఘనతను దక్కించుకోవడం కోసం ట్రంప్బైడెన్ మధ్య మాటల యుద్ధం మొదలైంది. దీనికి ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ కూడా తోడయ్యారు. తన ప్రమాణస్వీకారం నాటికి బందీలను విడుదల చేయకపోతే హమాస్ తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటుందని అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొన్నాళ్ల క్రితం ప్రకటించారు. మరోవైపు నెతన్యాహును కూడా విమర్శించే ఓ వీడియోను ఆయన షేర్ చేశారు. దీంతో ఇరువర్గాలపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. ఇజ్రాయెల్హమాస్ల మధ్య డీల్ కుదిరిన వార్తలు వచ్చిన వెంటనే ట్రంప్ సోషల్మీడియా ట్రూత్లో స్పందించారు. "ఇది చాలా గొప్ప కాల్పుల విరమణ ఒప్పందం. నవంబర్లో నా విజయం ఫలితంగా నా కార్యవర్గం శాంతిని కోరుకుంటుందనే విషయాన్ని ప్రపంచం మొత్తానికి చాటింది. మొత్తం అమెరికన్లు, మిత్రుల భద్రతను కాపాడేందుకు అవసరమైన ఒప్పందాలపై చర్చిస్తామనడానికి ఇది చిహ్నంగా నిలిచింది" అని పేర్కొన్నారు. బైడెన్ తన చివరి ప్రసంగం ప్రారంభంలో మాట్లాడుతూ "తాను గత మే నెలలో ప్రస్తావించిన అంశాలు ఈ డీల్లో ఉన్నాయి. వాటిని ఐరాసతో భద్రతామండలి సహా అన్ని దేశాలు అత్యధికంగా ఆమోదించాయి" అని పేర్కొన్నారు. తన కెరీర్లోనే చేసిన కఠినమైన డీల్ ఇదేనని చెప్పారు. కాబోయే అధ్యక్షుడి బృందంతో కూడా సమన్వయం చేసుకొని చర్చలు ముందుకుతీసుకెళ్లాలని తన బృందానికి సూచించినట్లు పేర్కొన్నారు. కానీ, ఈ శాంతిఒప్పందం కుదరడంలో ట్రంప్ పాత్ర లేదని బైడెన్ కొట్టి పారేశారు. ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ కూడా స్పందించారు. ఈ డీల్ కుదిర్చినందుకు జోబైడెన్ నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అమెరికన్ల భద్రతకు అధ్యక్షుడు అధిక ప్రాధాన్యం ఇస్తారన్నారు.

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
editor@mahaadaily.com | whatsapp- 7436939999

# వస్తోంది.. సరికొత్తగా...

విభిన్న శీర్షికలు... సంచలన కథనాలు...

EPAPER.MAHAADAILY.COM



# మహా పత్రిక

దమ్మున్న వార్తల వేదిక

రంగు పూసుకున్న పత్రిక కాదు.. రాజీలేని పత్రిక



FOLLOW: @MAHAADAILY

## కలెక్టరేట్ రోడ్డు కాంక్రీట్ వ్యర్థాలతో
# అధ్వాన్న పరిస్థితి నెలకొంది

**రెడ్ మిక్స్ వాహనాలతో అద్వానంగా రోడ్..అధికారులు గుర్తించి చర్యలు తీసుకోవాలి**



**ఇబ్రహీంపట్నం, జనవరి 16 మహా:** వండేర్లా నుంచి కొంగర మంగళపల్లి వెళ్లే మార్గంలో కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లే రహదారి వద్ద, కాంక్రీట్ వ్యర్థాలతో అధ్వాన్న పరిస్థితి నెలకొంది. ఇబ్రహీంపట్నం మండలం, కొంగరకలాన్ రెవెన్యూ పరిధిలో ఉన్న కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లే రహదారి వద్ద అధ్వాన్నంగా మారింది. చుట్టుపక్కల రెడ్ మిక్స్ కంపెనీలు ఉండడంతో తరచూ వాహనాల ద్వారా కాంక్రీట్ రవాణా జరుగుతూ ఉంటుంది. ఈ క్రమంలో కాంక్రీట్ లోడుతో వెళ్లే వాహనాలలో నుంచి కాంక్రీట్ వ్యర్థాలు రోడ్డు మీద పడి బ్రేక్ కట్టలాగా (స్పీడ్ బ్రేకర్స్) మారిపోతున్నాయి. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోతున్నారు. కలెక్టరేట్ వెళ్లే మార్గంలో ఇంతటి అధ్వాన్న పరిస్థితి ఉండడం గమనార్కమని పలువురు మండిపడుతున్నారు. రెడ్ మిక్స్ వాహనాలను అదుపు చేయలేకపోతే రోడ్డు పరిస్థితి మరింత దారుణంగా అవుతుందని, దీని ఇప్పటికైనా అధికారులు వాహనాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

# అఫ్జల్‌గంజ్‌లో ఫైరింగ్ కలకలం

**బీదర్ దొంగల ముఠా కాల్పులు, ఒకరి అరెస్ట్**

**హైదరాబాద్, మహా:** బీదర్‌లో ఏటీఎంలో డబ్బులు జమచేసే వాహనంపై దాడి చేసి దోచుకున్న బీదర్ దొంగలు హైదరాబాద్‌లోనూ కలకలం సృష్టించారు. దొంగలను వెతుక్కుంటూ వచ్చిన బీదర్ పోలీసులపై దుండగులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఒకరికి గాయాలు కాగా, ముఠాలో ఓ వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. అఫ్జల్‌గంజ్‌లో గురువారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. నిందితులు ముగ్గురు రాయ్‌పూర్ వెళ్లేందుకు టికెట్ బుక్ చేసుకున్నారు. సాయంత్రం వారు బస్ కోసం వేచి చూస్తున్న సమయంలో పోలీసులు రావడంతో వారిపై ఫైరింగ్ జరిపారు. ముఠా జరిపిన కాల్పుల్లో ట్రావెల్స్ మేనేజర్ జహంగీర్ కడుపులోకి బుల్లెట్ దూసుకెళ్లింది. జహంగీర్‌ను అక్కడే సమీపంలోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రత్యక్ష సాక్షి అహ్మద్ చెప్పిన ప్రకారం "మధ్యాహ్నం ఇద్దరు వ్యక్తులు వచ్చి రోషన్ ట్రావెల్స్‌లో మూడు టికెట్లు రాయపూర్‌కు బుక్ చేశారు. తిరిగి సాయంత్రం ఏడు గంటలకు ట్రావెల్స్ కార్యాలయానికి వచ్చారు. అక్కడ నుంచి మేము వారిని మినీ బస్సుల్లో బస్సులు ఆగే స్థలం వద్దకు తరలించడానికి సిద్ధమయ్యాం. ఇదే సమంయలో మా సిబ్బంది అనుమానంగా ఉన్న బ్యాగేజీ తనిఖీ చేస్తారు. అదే క్రమంలో రాయపూర్‌కు వెళ్తున్న నిందితుల బ్యాగేజీలను కూడా తనిఖీ చేస్తుండగా వారు డబ్బులు తీసి మా సిబ్బందికి ఇవ్వడానికి ప్రయత్నించారు ఈ క్రమంలో అదే మినీ బస్సులో ఉన్న కర్ణాటక పోలీసులు తాము పోలీసులమని సిబ్బందికి చెప్పారు. ఇంతలోనే ఆ ముగ్గురు బ్యాగులో నుంచి తుపాకీ తీసి కాల్పులు జరపారు. దీంతో మా మేనేజర్ జహంగీర్‌కు పొత్తికడుపుతో పాటు కాలికి గాయాలయ్యాయి.

### పోలీసుల అదుపులో ఓ నిందితుడు

సమాచారం అందుకున్న ఈస్ట్ జోన్ డీసీపీ ఘటన స్థలానికి చేరుకున్నారు. మొత్తం ముగ్గురు నిందితులు కాగా ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మిగతావారిని పట్టుకునేందుకు హైదరాబాద్ పోలీసులు రంగంలోకి దిగారు. ఉదయం ఇద్దరు సభ్యులున్న ఈ గ్యాంగ్ ఏటీఎంలో డబ్బులు పెట్టేందుకు వచ్చిన సిబ్బందిపై కాల్పులు జరిపి రూ.93 లక్షలున్న నగదుతో పరారయ్యారు. ఈ ఘటనలో ఓ సెక్యూరిటీ గార్డ్ ప్రాణాలను కోల్పోయారు. వారిని వెతుక్కుంటూనే బీదర్ పోలీసులు హైదరాబాద్ వచ్చారు.




# ప్రైవేట్ హాస్టల్లో దారుణం
# యువతిపై అత్యాచారం

**ఇబ్రహీంపట్నం, జనవరి 16 మహా:** ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన వెలుగు చూసింది. బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పై కన్నేసిన డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. మంగళపల్లి పరిధిలోని ఓ ప్రైవేట్ హాస్టల్లో ఉంటూ స్థానికంగా ఉన్న ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న యువతి. బుధవారం రాత్రి హాస్టల్ గదిలో నిద్రిస్తున్న సమయంలో ఆమెపై, అదే హాస్టల్ బిల్డింగ్ యాజమాని డ్రైవర్ అఘాయిత్యానికి ఒడిగట్టాడని తెలిపారు. గురువారం సమాచారం అందుకున్న బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

# అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం




**బట్టు శ్రీనివాస్**

**ఇబ్రహీంపట్నం, జనవరి 16 మహా:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ ల విగ్రహాల ఏర్పాటుకై విరాళం అందించిన బట్టు శ్రీనివాసు. యాచారం మండలం, మాల్ గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేయనున్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మరియు స్వతంత్ర సమరయోధుడు బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను గ్రామంలో ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా యాచారం మండలం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ ముదిరాజ్ లక్ష 30 వేల రూపాయలు విరాళంగా అందించడం జరిగింది. వెల్దండలో రూపకల్పన చేసిన విగ్రహాలను, మాల్ గ్రామంలో ప్రతిష్టించడానికి గురువారం తరలించడం జరిగింది. యాచారం మండల మాజీ ప్రజా ప్రతినిధులు చిన్నోల్ల జంగమ్మ యాదయ్య, చిన్నోళ్ల పద్మజ జహంగీర్, చిన్నోళ్ల మల్లేష్, భాస్కర్ గౌడ్, గుడుగుంట్ల కృష్ణ, విగ్రహాల కమిటీ అధ్యక్షులు మంద లింగం, గడుగుంట్ల యాదయ్య, చిన్నోళ్ల వెంకటయ్య, చిన్నోళ్ల యాదయ్య, గుడుగుంట్ల రాములు, గడ్డమీది మదార్, చిన్నోళ్ల గోపాల్, గడ్డమీది యాదయ్య, చిన్నోళ్ల మల్లయ్య, జంగిలి యాదయ్య, మస్కు ముత్యాలు, బోడ ముత్యాలు, తదితరులు పాల్గొనడం జరిగింది.

# కుంభమేళాలో రాగాల కుంభం

**నాలుగుచోట్ల 24 వేదికలు.. జనసంద్రంతో నదీతీరం**

**మహా ప్రత్యేకం:** త్రివేణి సంగమం వద్ద కళా సాంస్కృతిక మహా కుంభం నిర్విస్తున్నారు. జనవరి 16 నుంచి ప్రారంభమైన రాగాల మేళా ఫిబ్రవరి 24 వరకు సాంస్కృతిక మహాకుంభం ఉంటుంది. ప్రధాన వేదికగా గంగ పండల్ ఉంటుంది. ఇక్కడ కైలాష్ ఖేర్, సోనూ నిగమ్ వంటి దిగ్గజ గాయకులు సహా దేశంలోని ప్రముఖ కళాకారులు ప్రదర్శనలు ఇవ్వనున్నారు. యమునా పండల్, సరస్వతి పండల్‌లో కూడా సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. కళాప్రదర్శనల కోసం నాలుగు చోట్ల 24 వేదికలను ఏర్పాటు చేశారు. ప్రయాగ్ రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ్ మేళాకు భక్తులు పోటెత్తుతున్నారు. 45 రోజుల్లో 50కోట్ల మంది త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఇప్పటికే ఆరుకోట్ల మంది భక్తులు పుణ్యస్నాలు ఆచరించగా, జనవరి 29 మౌని అమావాస్య, ఫిబ్రవరి 3 వసంత పంచమి స్నానం, ఫిబ్రవరి 12 మాఘ పౌర్ణమి, కుంభమేళా చివరి రోజు ఫిబ్రవరి 26 మహా శివరాత్రికావడంతో.. ఆ రోజుల్లో భక్తుల తాకిడి ఎక్కువుగా ఉండే అవకాశం ఉంది. ఈ రోజులు ఎంతో ప్రత్యేకమని చెబుతున్నారు. దీంతో ఆయా రోజులను పరిగణనలోకి తీసుకుని తెలుగురాష్ట్రాల ప్రజలు కుంభమేళా ప్లాన్ చేసుకోవాలని నిర్వాహకులు సూచిస్తున్నారు. ఈ రోజులను గుర్తుపెట్టుకుని దానికి తగ్గట్లు ఏర్పాట్లు చేసుకోవాలి. ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం మహాకుంభమేళాలో నాలుగో రోజు. ఫిబ్రవరి 26 వరకూ జరగనున్న మహా కుంభ మహోత్సవానికి దేశ విదేశీ భక్తులు పోటెత్తుతున్నారు. 144 ఏళ్లకు ఒకసారి వచ్చే అరుదైన కుంభమేళా కావడంతో త్రివేణీ సంగమానికి వచ్చే భక్తుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. గంగా నదీతీర ప్రాంతమంతా జనసంద్రాన్ని తలపిస్తోంది.



## మినీ మేడారం జాతర ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలి

**పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్.**



**ములుగు, మహా :** ఫిబ్రవరి 12 నుండి 15వ తేదీ వరకు జరిగిన మినీ మేడారం జాతరకు వచ్చే భక్తులకు కల్పించవలసిన సౌకర్యాలను వేగవంతంగా పూర్తి చేయాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్ అన్నారు. గురువారం తాడ్వాయి మండలంలోని మేడారంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆకస్మిక పర్యటించి క్యూలైన్, జంపన్న వాగు వద్ద స్నాన ఘట్టాలు, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినీ మేడారం జాతరను పురస్కరించుకొని ప్రతిరోజు వేలాది మంది భక్తులు అమ్మవాళ్లను దర్శించుకుంటున్నారని, ఈ సందర్భంలో పారిశుద్ధ్యం లోపించకుండా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్ర పరచాలని సూచించారు. భక్తులు క్యూ లైన్ లో గద్దెల ప్రాంతానికి వెళ్తున్న సమయంలో తోపులాట జరగకుండా చూసుకోవాలని, అక్కడ త్రాగునీటి ఏర్పాటు చేయాలని, గద్దెల ప్రాంతం తో పాటు పరిసర ప్రాంతాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జంపన్న వాగు ప్రాంతంలో పుణ్య స్థానాలు ఆచరించిన అనంతరం మహిళలు బట్టలు మార్చుకోవడానికి ప్రత్యేక గదులను ఏర్పాటు చేయాలని, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్ర పరుస్తూ శుభ్రమైన మంచి నీటిని సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నాలుగు రోజుల పాటు జరిగే మినీ మేడారం జాతరకు ఎక్కువ మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని దీనిని దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, ఎంపి డి ఓ సుమన వాణి, పంచాయితి కార్యదర్శి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ హాస్టల్ లో బీటెక్ స్టూడెంట్ సూసైడ్

**అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన**



**అబ్దుల్లాపూర్ మెట్, జనవరి 16, మహా:** అనుమానాస్పద స్థితిలో బీటెక్ ఫస్ట్ ఇయర్ విద్యార్థి ఉరి వేసుకొని సూసైడ్ చేసుకున్న సంఘటన అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వనపర్తి జిల్లా పెద్దగూడెంకు చెందిన ఎద్దుల భాను ప్రకాశ్ (19) రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండల కేంద్రంలోని శ్రీ సాయి బాలజీ బాయ్స్ హాస్టల్ లో ఉంటూ స్థానికంగా ఉన్న బ్రిలియంట్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం రాత్రి తోటి రూంమెట్స్ కలిసి భోజనం చేసిన తరువాత.. హాస్టల్లో ఉండే వారందరు నిద్రపోయిన సమయం చూసి..హాస్టల్ భవనం పెంట్ హౌస్ లో ఉన్న ఇనుప నిచ్చెనకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సంక్రాంతి పండుగ కోసం సొంత గ్రామాలకు వెళ్లిన అదే హాస్టల్ ఉండే ఓ విద్యార్థి గురువారం తెల్లవారుజామున 3:30 ప్రాంతంలో హాస్టల్ చేరుకునే.. సమయానికి భానుప్రకాశ్ ఇనుప నిచ్చెనకు విఘతజీవిగా వేలాడుతు కనిపించాడు. నిద్రపోయిన తోటి రూం మెట్స్ ను నిద్రలోంచి లేపి అబ్దుల్లాపూర్ మెట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని డెడ్ బాడీని కిందకు దించి.. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియ దవాఖనకు తరలించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్స్పెక్టర్ అంజిరెడ్డి తెలిపారు.ఇది ఇలా ఉండగా బానుప్రకాశ్ ఆత్మహత్య చేరుకోవడానికి కళాశాల వేధింపుల ఇంకా ఏమైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



## మిల్స్ కాలనీ ఎస్సైకు తప్పిన
# పెను ప్రమాదం

**వరంగల్, మహా:** వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని మిల్స్ కాలనీ పోలీస్ ఠాణాలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సురేష్ కొత్తకొండ జాతర జరుగుతున్న క్రమంలో వీరభద్ర స్వామిని దర్శించుకునేందుకు వెళుతుండగా ఎల్కతుర్తి సమీపంలోని కొత్తపల్లి గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న టిప్పర్ ను తప్పించబోయి కంగారులో బ్రేకుకు బదులుగా ఎక్స్‌లేటర్ పై కాలు మోపగా కారు రేజ్ అయి ఎదురుగా ఉన్న మొరం దిబ్బను ఢీ కొట్టి కారు పల్టీలు కొట్టినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో ఎస్సై సురేష్ కు స్వల్ప గాయాలతో బయటపడి క్షేమంగా ఉన్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

# నేడు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడి రాక



**వరంగల్, మహా :** షెడ్యూల్డ్ కులాల పరిరక్షణకు నియమించబడిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ నేడు (శుక్రవారం) వరంగల్ నగరానికి రానున్నారని జిల్లా కలెక్టర్ డా.సత్య శారద నేడోక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీలకు కల్పించిన హక్కులు, రక్షణ అమలు, బాధితుల కుటుంబానికి చెల్లించే బకాయిలపై కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో మ. 2 గం.లకు సంబందిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన అనంతరం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారని అంతేకాకుండా మీడియా ప్రతినిధులతో నిర్వహించే సమావేశంలో కూడా పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు.

# నేటి నుండి పోలీస్ క్రీడలు ప్రారంభం

**వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



వరంగల్ పోలీస్ కమిషనరేట్ మూడవ వార్షిక క్రీడల్లో భాగంగా స్పోర్ట్స్ మీట్ నేడు ఉదయం పది గంటలకు హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ప్రారంభం అవుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఓ ప్రకటనలో తెలిపారు. నేటి నుండి మూడు రోజుల పాటు జరిగే ఈ పోలీస్ క్రీడల్లో సెంట్రల్ జోన్, వెస్ట్ జోన్, ఈస్ట్ జోన్ తోపాటు, పోలీస్ అనుబంధ విభాగాలు, ఆర్మడ్ రిజర్వ్ విభాగాలకు పోలీస్ క్రీడాకారులు 12 క్రీడాంశాల్లో పోటీ పడుతారని. ఈ పోటీల్లో విజేతలు నిలిచిన పోలీస్ క్రీడాకారులకు క్రీడల ముగింపు రోజున బహుమతి ప్రధానం చేయడంతో పాటు వచ్చే నెలలో కరీంనగర్ లో నిర్వహించబడే రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడ పోటీల్లో పాల్గొంటారు. ఈ క్రీడా పోటీలను అత్యధిక సంఖ్యలో ప్రజలు తిలకించి పోలీస్ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ఈ క్రీడలను విజయవంతం చేయాల్సిందిగా పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు.

# 6 నెలలు గడిచినా దక్కని న్యాయం.!

- ఐఎంఏ సమక్షంలో తప్పు ఒప్పుకున్న బంధన్ హాస్పటల్
- ఎక్స్పర్ట్ కమిటీ రిపోర్ట్ కోసం వేచి చూస్తున్న బాధితుడు కృష్ణ

**వరంగల్ జిల్లా టీఎస్ జేయూ**




**హనుమకొండ, మహా:** హనుమకొండ నగరంలోని విజయ టాకీస్ రోడ్డులో ఉన్న బంధన్ హాస్పిటల్లో సుమారు ఆరు నెల క్రితం బాధితుడు జర్నలిస్టు కృష్ణకు జరిగిన అన్యాయంపై త్వరితగతిన విచారణ చేపట్టి న్యాయం చేయాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్ జేయూ) అఫిలియేటెడ్ టూ నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఇండియా (ఎన్ యూజేఐ) నాయకులు అన్నారు. గురువారం రోటరీ క్లబ్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో టీఎస్ జేయూ యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా పూర్తి స్థాయిలో జర్నలిస్టు కృష్ణకు జరిగిన అన్యాయంపై అధికారులు విచారణ చేపట్టి బాధితుడికి న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఇప్పటికే బాధితుడు హన్మకొండ డీఎంహెచ్ఓ, తెలంగాణ స్టేట్ ఐఎంఏ, వరంగల్ ఐఎంఏ, తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ లలో ఫిర్యాదు చేసిన విషయం అందరికి తెలిసిందే. అయితే సమాజంలో ఫోర్త్ ఎస్టేట్ వృత్తిలో ఉన్న బాధితుడు కృష్ణకే న్యాయం జరగక నెలలుగా పోరాటం చేస్తుంటే స్పందించని అధికారులు, ఇక సాధారణ ప్రజల పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు న్యాయబద్ధంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ జేయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్, నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఇండియా (ఎన్ యూజేఐ) నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ రాం చందర్, టీఎస్ జేయూ వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కందికొండ మోహన్, అవునూరి కుమారస్వామితో పాటు యూనియన్ కార్యవర్గ సభ్యులు బత్తుల సత్యం, రావుల నరేష్, కృష్ణ, కందికొండ గంగరాజు, నాగపూరి నాగరాజు, ఈద శ్రీనాథ్, శ్రీహరి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం
# ఢీకొని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పరిగి మండలం గడిసింగాపూర్ గ్రామ శివారులో గురువారం రాత్రి హైవే 163 పై వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు. గుర్తు తెలియని వాహనం బలంగా ఢీ కొట్టడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి దోమ మండలం కుమ్మరి కుంట తండా కు చెందిన సుభాష్ (29) గా గుర్తించారు. సుభాష్ దినసరి కూలీగా పని చేస్తూ ఉండేవాడు. పనులు ముగించుకొని స్వగ్రామానికి నడుచుకుంటూ బయలుదేరి వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. సుభాష్ మృతదేహాన్ని పరిగి పోలీసులు మార్చురీలో భద్రపరిచారు. ఢీ కొట్టి వెళ్లిన వాహనాన్ని గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు.

# లారీను ఢీ కొట్టిన కారు.. 10 మందికి గాయాలు








**ములుగు, మహా :** మేడారం వనదేవతలను దర్శించుకుని తిరిగి వస్తున్న అశోక్ లేలండ్ వాహనాన్ని కారు వెనుక నుండి ఢీ కొట్టిన సంఘటన ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లింగాపూర్ క్రాస్ రోడ్ వద్ద గురువారం రాత్రి జరిగింది. తెలిసిన వివరాల ప్రకారం.. తొర్రూరు మండలం పోలపల్లి గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన 15 మంది మేడారం సమ్మక్క సారలమ్మ తల్లిని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. రాత్రి 8 గంటల సమయంలో లింగాపూర్ క్రాస్ వద్ద పస్రా నుండి వేగంగా వస్తున్న కారు లారీని తప్పించబోయి ఢీకొట్టింది. అశోక్ లేలండ్ పల్టీలు కొట్టుకుంటూ రోడ్డు పక్కనున్న గుంతలో పడిపోగా పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వెంకటాపూర్ ఎస్సై సతీష్ సంఘటన స్థలానికి చేరుకొని చేరుకుని వారిని అంబులెన్స్ లో ములుగు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ములుగు ఏరియా హాస్పిటల్ లో పరీక్షించిన డాక్టర్లు ఆరుగురి పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎం కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెంకటాపూర్ ఎస్సై సతీష్ తెలిపారు.

## నకిలీ మీసేవ వెబ్ సైట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలి

**జిల్లా ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్**



**ములుగు, మహా :** ప్రభుత్వం కొత్త మీసేవ సెంటర్లను ఏర్పాటు చేయబోతుందని, అందుకు మీసేవ వెబ్ సైట్ లింక్ ద్వారా నమోదు చేసుకోవాలని వస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మి మోసపోవద్దని జిల్లా ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే మీసేవ సెంటర్ నిర్వాహణ కోసం దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సందేశం పంపుతూ మోసగాళ్లు నకిలీ మీసేవ పోర్టల్ ను కూడా రూపొందించారని తెలిపారు. ఆ పోర్టల్ లో నమోదు చేసుకోవాల్సిందిగా సందేశం పంపుతున్నారని, ఈ విషయమై కేసు నమోదై దర్యాప్తు జరుగుతోందని, నకిలీ వెబ్ సైట్ ను బ్లాక్ చేయడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఈ నకిలీ వెబ్ సైట్ కి ఎలాంటి వ్యక్తిగత సమాచారమూ ఇవ్వవద్దని, డబ్బులు చెల్లింపు చేసి మోసపోవద్దని ఆయన తెలిపారు.

# హిండెన్‌బర్గ్ పేరు వెనుక కథ ఏమిటో తెలుసా..?

ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీ గ్రూప్‌పై సంచలన ఆరోపణలతో వార్తల్లో నిలిచిన అమెరికాకు చెందిన షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ మూతపడిన విషయం తెలిసిందే. బడా వ్యాపార సంస్థలకు వణకుపుట్టించిన ఈ సంస్థకు 'హిండెన్‌బర్గ్' అన్న పేరు ఎలా వచ్చిందో తెలుసా..? 'హిండెన్‌బర్గ్' అనేది జర్మనీకి చెందిన ప్రయాణికుల హైడ్రోజన్ ఎయిర్ షిప్ పేరు. 1937లో అమెరికాలోని న్యూజెర్సీలో ప్రమాదానికి గురైంది. 35 మంది మరణించారు. ఈ ప్రమాదానికి కారణం మానవ తప్పిదమే అని తర్వాత దర్యాప్తులో తేలింది. ఈ ఉదంతాన్ని ఉటంకిస్తూ.. హిండెన్‌బర్గ్ పేరును తమ సంస్థకు పెట్టడానికి గల కారణాన్ని అండర్సన్ వెబ్‌సైట్‌లో ఇలా వివరించారు. 'హిండెన్‌బర్గ్‌ఎయిర్ షిప్ దుర్ఘటన పూర్తిగా మానవుడు సృష్టించిన విపత్తు. మండే స్వభావం ఉన్న హైడ్రోజన్ నింపిన బెలూన్‌లో 100 మందిని ఎక్కించారు. గతంలో ఇలాంటి ఎయిర్‌షిప్‌లకు ప్రమాదాలు జరిగినా.. నిర్వాహకులు పట్టించుకోలేదు. మేము కూడా మానవులు ఉద్దేశపూర్వకంగా సృష్టించిన విపత్తులు మార్కెట్లో తిరుగుతుంటే వాటిని అన్వేషిస్తాం. అవి బాధితులను ఆకర్షించడానికి ముందే వాటిని వెలుగులోకి తీసుకొస్తాం' అని తెలిపారు.

HINDENBURG RESEARCH



# హైదరాబాద్‌లో ఇండ్లకు తగ్గిన గిరాకీ..

## 36 శాతం డౌన్.. కారణమిదేనా..?!



దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల పరిధిలో డిసెంబర్ త్రైమాసికంలో ఇండ్ల విక్రయాలు తగ్గుముఖం పట్టాయి. ఇండ్ల ధరలు ఎక్కువగా ఉండటం వల్లే డిమాండ్ తగ్గిందని ప్రముఖ రియాల్టీ కన్సల్టెంట్ సంస్థ ప్రాప్ టైగర్ పేర్కొంది. 202324 డిసెంబర్ త్రైమాసికంతో పోలిస్తే 202425 డిసెంబర్ త్రైమాసికంలో ఇండ్ల విక్రయాలు 26 శాతం తగ్గి 1,06,038 యూనిట్లకు పడిపోయాయి. 202324 డిసెంబర్ త్రైమాసికంలో ఇండ్ల విక్రయాలు 1,43,482 యూనిట్లుగా ఉన్నాయని ప్రాప్ టైగర్ వెల్లడించింది. 2023తో పోలిస్తే 2024లో ఇండ్ల విక్రయాలు మాత్రం ఆరుశాతం వృద్ధి చెందాయి. అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, కోల్‌కతా, ఢిల్లీఎన్‌సీఆర్ (నొయిడా, గ్రేటర్ నొయిడా, ఘజియాబాద్, ఫరీదాబాద్), ముంబై మెట్రో పాలిటన్ రీజియన్ (ముంబై, నేవీ ముంబై, ఠాణె), పుణె పరిధిలో 2023లో 4,10,791 ఇండ్లు అమ్ముడైతే, 2024లో 4,36,992 యూనిట్లు అమ్ముడు పోయాయి. 'అక్టోబర్‌డిసెంబర్ త్రైమాసికంలో పండుగల సీజన్ నేపథ్యంలో ఇండ్ల విక్రయాలు పెరుగుతాయని అంచనా వేశారం. పలు రీజియన్ల పరిధిలో ఇండ్ల అమ్మకాలతోపాటు కొత్త వెంచర్ల ప్రారంభం కూడా తగ్గుముఖం పట్టింది' అని ప్రాప్ టైగర్ డాట్ కామ్, హౌసింగ్ డాట్ కామ్ గ్రూప్ సీఈఓ ధృవ్ అగర్వాల్ తెలిపారు. వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, పలు అంతర్జాతీయ పరిణామాలు, ఆస్తులు ప్రత్యేకించి ఇండ్ల ధరలు పెరిగిపోవడంతో ఇటు డెవలపర్లు, అటు ఇండ్ల కొనుగోలుదారులు వేచి చూసే ధోరణి కనబరిచారు. నెమ్మదించిన ఆర్థిక వృద్ధిరేటు, ఇప్పట్లో వడ్డీరేట్లు తగ్గే సంకేతాలు లేకపోవడంతో ఇండ్ల కొనుగోలుదారులు ఆచితూచి స్పందిస్తున్నారు. అక్టోబర్‌డిసెంబర్ త్రైమాసికంలో ఢిల్లీఎన్‌సీఆర్ పరిధిలో మాత్రమే అధిక ఇండ్ల విక్రయాలు జరిగాయి. 2023తో పోలిస్తే 2024లో ఢిల్లీఎన్‌సీఆర్ పరిధిలో ఇండ్ల విక్రయాలు 6528యూనిట్ల నుంచి 9808 యూనిట్లకు పెరిగాయి. ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ పరిధిలో 31 శాతం తగ్గి 48,553 యూనిట్ల నుంచి 33,617 యూనిట్లకు పరిమితం అయ్యాయి. పుణెలోనూ 31శాతం క్షీణత నమోదైంది. 2023 డిసెంబర్ త్రైమాసికంలో 18,240 యూనిట్లు మాత్రమే అమ్ముడయ్యాయి. కర్ణాటక రాజధాని బెంగళూరులో 23 శాతం క్షీణతతో 13,236 యూనిట్లకు, తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో 36 శాతం తగ్గి 13,179 యూనిట్లకు చేరుకున్నాయి. చెన్నైలో ఐదు శాతం తగ్గి 4,073 ఇండ్ల విక్రయాలు నమోదైతే, అహ్మదాబాద్‌లో 34 శాతం పతనమై 15,310 యూనిట్ల నుంచి 10,170 యూనిట్లకు పరిమితం అయ్యాయి. ఇక కోల్‌కతాలో 4735 యూనిట్ల నుంచి 3715 యూనిట్లకు దిగి వచ్చాయి.



# లాభాల్లో ముగిసిన మార్కెట్లు

## సెన్సెక్స్ 318 పాయింట్లు జంప్..!

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో సెషన్‌లో లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల పవనాలతో మార్కెట్లు లాభాల్లో కొనసాగాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్.. 77,319.50 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 76,895.51 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యధికంగా 77,319.50 పాయింట్ల గరిష్ఠానికి చేరింది. చివరకు 318.74 పాయింట్లు పెరిగి.. 77,042.82 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 98.60 పెరిగి.. 23,311.80 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో దాదాపు 2669 షేర్లు లాభపడ్డాయి. మరో 1,132 షేర్లు నష్టపోయాయి. నిఫ్టీలో అత్యధికంగా లాభపడిన వాటిలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, అదానీ పోర్ట్స్ ఉన్నాయి. ట్రెంట్, టాటా కన్స్యూమర్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, హెసీఎల్ టెక్, విప్రో నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఒకశాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 1.4 శాతం పెరిగింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఐటీ, ఎఫ్ఎంసీజీ, ఫార్మా మినహా మిగతా అన్ని రంగాల సూచీలు మెటల్, మీడియా, ఆయిల్ అండ్ గ్యాస్, పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ, ఆటో 0.5 నుంచి 2.5 శాతం పెరిగాయి.

# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్‌న్యూస్

## 8వ వేతన సంఘం ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం



ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కేంద్రం శుభవార్త చెప్పింది. 8వ వేతన సంఘం ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని గురువారం కేంద్ర కేబినెట్ సమావేశమైంది. ఈ సందర్భంగా కీలక నిర్ణయాలు తీసుకున్నది. నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం జనవరి 2016లో అమలులోకి తీసుకువచ్చిన 7వ వేతన సంఘం సిఫార్సులు ఈ ఏడాది డిసెంబర్ 31తో ముగియనున్నాయి. ఎనిమిదో వేతన సంఘం వచ్చే ఏడాది జనవరి ఒకటి నుంచి అమలులోకి రానున్నాయి. వేతన సంఘం సిఫారసుల మేరకు ఉద్యోగులకు వేతనాలు పెరగనున్నాయి. వేతనం సంఘం ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపిన నేపథ్యంలో త్వరలోనే కమిషన్ చైర్మన్‌తో పాటు ఇద్దరు సభ్యులను నియమించనున్నది. ఉద్యోగులు, పెన్షనర్లు, ట్రేడ్ యూనియన్లు కేంద్ర ప్రభుత్వం 8వ వేతన సంఘం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వచ్చే నెలలో కేంద్రం పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కేంద్ర కేబినెట్ సమావేశమైన పలు కీలక నిర్ణయాలు తీసుకుంది.



# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL






# ఎన్టీఏ సంచలన నిర్ణయం..

## పెన్ పేపర్ మోడ్‌లోనే నీట్ యూజీ-2025 పరీక్ష

ఎంబీబీఎస్ సహా యూజీవైద్య విద్యాకోర్సుల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే నీట్ (NEET) పై జాతీయ పరీక్షా సంస్థ (ఎన్టీఏ) సంచలన ప్రకటన చేసింది. సింగిల్ డే - సింగిల్ షిఫ్ట్‌లో పెన్ పేపర్ మోడ్ (ఓఎంఆర్ బేస్డ్)లో నీట్ పరీక్ష నిర్వహిస్తామని తెలిపింది. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ఖరారు చేసిన మార్గదర్శకాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నది. ఎంబీబీఎస్‌తోపాటు బీఏఎంఎస్, బీయూఎంఎస్, బీఎస్ఎంఎస్ కోర్సులకు యూనిఫామ్ నీట్ (యూజీ) పరీక్ష నిర్వహిస్తామని ఎన్టీఏ తెలిపింది. నీట్ (యూజీ) ఫలితాల ఆధారంగా నేషనల్ కమిషన్ ఫర్ హోమియోపతి కింద బీహెచ్ఎంఎస్ కోర్సు అడ్మిషన్లు నిర్వహిస్తారు. దీంతోపాటు ఆర్మ్‌డ్ మెడికల్ సర్వీస్ హాస్పిటల్స్‌లో బీఎస్సీ నర్సింగ్ కోర్సు అడ్మిషన్లకు నీట్ (యూజీ) క్వాలిఫై కావాల్సి ఉంటుంది. నాలుగేండ్ల బీఎస్సీ నర్సింగ్ కోర్సుకు కూడా నీట్ (యూజీ) కోర్సులో అర్హత సాధించాల్సి ఉంటుందని ఎన్టీఏ తెలిపింది.

# గోద్రా రైలు ఘటనపై ఫిబ్రవరి 13న సుప్రీంకోర్టులో విచారణ



**న్యూఢిల్లీ:** 2002లో జరిగిన గోద్రా రైలు ఘటనపై.. ఫిబ్రవరి 13వ తేదీన విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. గుజరాత్ ప్రభుత్వంతో పాటు అనేక మంది దాఖలు చేసిన పిటీషన్లపై విచారణ చేపట్టనున్నది. ఈ కేసు విచారణకు మరో తేదీని ఇవ్వబోమనని జస్టిస్ జేకే మహేశ్వరి, అరవింద్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది. 2002, ఫిబ్రవరి 27వ తేదీన సబర్మతి రైలుకు చెందిన ఎస్6 బోగీలో చెలరేగిన మంటల్లో సుమారు 59 మంది ప్రయాణికులు మరణించారు. ఆ కేసులో 2017లో గుజరాత్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ అనేక మంది సుప్రీంలో అప్పీల్ చేసుకున్నారు. జీవిత ఖైదు శిక్ష పడిన 11 మంది నిందితులకు మరణశిక్ష విధించాలని కోరుతూ గత ఏడాది ఫిబ్రవరిలో గుజరాత్ సర్కారు సుప్రీంను ఆశ్రయించింది. అయితే గురువారం విచారణ సమయంలో ఓ నిందితుడి తరపున లాయర్ హాజరయ్యారు. కానీ ఆధారాలు సమర్పించలేకపోయారు. గత ఏడాది నుంచి ఈ కేసును ఇప్పటి అయిదు సార్లు వాయిదా వేశానని, ఇక మళ్లీ వాయిదా వేయబోమని జస్టిస్ మహేశ్వరి తెలిపారు. కొందరు నిందితులకు చెందిన క్షమాభిక్ష పిటీషన్లు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నట్లు సుప్రీంకు లాయర్ తెలిపారు. గుజరాత్ ప్రభుత్వ అప్పీల్‌పై ముందుగా విచారణ చేపట్టాలని సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే కోరారు.

# భారత గణతంత్ర వేడుకలకు చీఫ్ గెస్ట్‌గా ఇండోనేషియా అధ్యక్షుడు



**న్యూఢిల్లీ :** భారత 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవా సుబియాంటో ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈ విషయాన్ని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారికంగా గురువారం ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు ఇండోనేషియా అధ్యక్షుడు రిపబ్లిక్ వేడుకలకు హాజరవుతున్నట్లు తెలిపింది. ఈ క్రమంలో ఇండియాలో ఇండోనేషియా ప్రెసిడెంట్ జనవరి 25, 26 తేదీల్లో పర్యటించనున్నారు. 2024 అక్టోబర్‌లో ప్రబోవా సుబియాంటో ఇండోనేషియా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత.. భారత్‌లో ఆయన అడుగుపెట్టడం ఇదే తొలిసారి అని విదేశాంగ శాఖ ప్రకటించింది. ఈ పర్యటన రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరిచేందుకు దోహద పడుతుందని తెలిపింది. ప్రాంతీయ, ప్రపంచ సమస్యలను చర్చించడానికి అవకాశాన్ని కల్పిస్తుందని విదేశాంగ శాఖ పేర్కొంది. సుబియాంటో 2020లో ఇండోనేషియా రక్షణ మంత్రిగా న్యూఢిల్లీని సందర్శించారు. కాగా 1950 నుంచి భారత్ తన మిత్ర దేశాల అధినేతలను గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆహ్వానించడం ఆనవాయితీగా వస్తోంది. 1952, 53, 66ల్లో మాత్రమే విదేశీ అతిథులు లేకుండా రిపబ్లిక్ డే వేడుకలను నిర్వహించారు. 2024లో ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మక్రాన్ ముఖ్య అతిథిగా రాగా.. 2023లో ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫట్టా ఎస్సిసిని అతిథిగా వచ్చారు. 2021, 2022 సంవత్సరాల్లో కరోనా కారణంగా గణతంత్ర దినోత్సవ వేడుకలకు అతిథులను ఆహ్వానించలేదు.

# ముంబై సేఫ్‌గా లేదనడం కరెక్ట్ కాదు : సీఎం దేవేంద్ర ఫడణవీస్



బాలీవుడ్ నటుడు.. పటౌడి వంశ వారసుడు సైఫ్ అలీఖాన్ మీద దాడి జరిగిన విషయం తెలిసిందే. అతడిపై గుర్తుతెలియని వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. గురువారం తెల్లవారుజామున ముంబై బాంద్రాలోని ఆయన నివాసంలోకి చొరబడిన దుండగుడు కత్తితో సైఫ్‌పై దాడి చేశాడు. దీంతో ఆయన ఒంటిపై ఆరుచోట్ల గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు ఆయనను హుటాహుటిన లీలావతి దవాఖానకు తరలించారు. గాయలతో ఉన్న సైఫ్‌కి వైద్యులు సర్జరీ చేయగా.. విజయవంతగా పూర్తయినట్లు తెలిసింది. దీంతో సైఫ్ ప్రమాదం నుంచి బయటపడినట్లు ఆసుపత్రి సిబ్బంది వెల్లడించింది. అయితే సైఫ్ అలీ ఖాన్‌పై దాడి జరిగిన అనంతరం ముంబై సురక్షితం కాదనే ట్రెండ్ మొదలైంది. ఇప్పటికే ముంబైలో మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్ధిఖీని కాల్చి చంపిన లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ అనంతరం కండల వీరుడు సల్మాన్ ఖాన్ చంపేస్తామంటూ వార్నింగ్ ఇచ్చింది. ఇప్పుడు తాజాగా సైఫ్ అలీఖాన్‌పై కూడా దాడి జరగడంతో సెలబ్రిటీలకే రక్షణ లేకపోతే ఇక సాధారణ ప్రజల పరిస్థితి ఏంటి అని అటు సినీ ప్రముఖులతో పాటు కొందరు ప్రతిపక్ష నేతలు ప్రశ్నిస్తున్నారు. అయితే ఈ వ్యాఖ్యలపై తాజాగా స్పందించారు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్. ఆయన మాట్లాడుతూ.. సైఫ్ అలీఖాన్‌పై దాడి జరగడం ఆందోళన కలిగించే విషయమే కానీ ఈ విషయం వలన ముంబైని సురక్షితం కాదని అనడం తప్పు. దేశంలోని అన్ని మెగాసిటీల్లో కెల్లా ముంబయి సురక్షితమైనది. అప్పుడప్పుడు ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయనేది వాస్తవమే. వీటిని నిరోధించడానికి అలాగే భద్రతా చర్యలను పెంచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ముంబై పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ద్వారా దాడి చేసిన వ్యక్తిని గుర్తించారు, దర్యాప్తు కొనసాగుతోంది! అంటూ ఫడణవీస్ చెప్పుకొచ్చారు.

# నిరుద్యోగులకు శుభవార్త

## ఐబీపీఎస్ ఎగ్జామ్ క్యాలెండర్ విడుదల



కొత్త ఏడాదిలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు శుభవార్త. బ్యాంకు ఉద్యోగాలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు.. ఐబీపీఎస్ శుభవార్త వినిపించింది. 2025 ఏడాదికి గానూ ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో చేపట్టనున్న ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఐబీపీఎస్ ఎగ్జామ్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఈ జాబ్ క్యాలెండర్ ద్వారా ఆయా బ్యాంకుల్లో ఆఫీసర్ స్కేల్ 1, 2, 3, ఆఫీస్ అసిస్టెంట్లు వంటి ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో ప్రొబేషనరీ ఆఫీసర్లు, మేనేజ్‌మెంట్ ట్రెయినీలు, స్పెషలిస్ట్ ఆఫీసర్లు, వినియోగదారుల సేవా సహాయకుల వంటి పోస్టుల భర్తీని చేపట్టనున్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులకు సంబంధించిన ఆన్‌లైన్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షల తేదీల వివరాల కోసం అధికారిక పోర్టల్ https://ibps.inను చూడొచ్చు.

### ఐబీపీఎస్ పరీక్షల వివరాలు..

**ఆఫీసర్ స్కేల్ 1 :**

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఆఫీస్ అసిస్టెంట్లు, ఆఫీసర్ స్కేల్ 1, 2, 3 స్థాయి ఉద్యోగాల భర్తీకి ఉమ్మడిగా ప్రిలిమినరీ పరీక్షలు జరుగుతాయి. ఆఫీసర్ స్కేల్ 1 స్థాయి పోస్టులకు దరఖాస్తు చేసేవారికి ఈ ఏడాది జులై 27న, ఆగస్టు 2, 3 తేదీల్లో ప్రిలిమినరీ పరీక్షలను నిర్వహిస్తారు. దీనికి సంబంధించిన మెయిన్స్ పరీక్ష నవంబరు 13న జరుగుతుంది.

**ఆఫీసర్ స్కేల్ 2, 3 :**

ఈ పోస్టులకు సంబంధించిన పరీక్ష తేదీలను ఐబీపీఎస్ విడుదల చేయలేదు. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించే వారికి నవంబరు 13న మెయిన్స్ పరీక్ష ఉంటుంది.

**ఆఫీస్ అసిస్టెంట్స్ :**

ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారికి ఆగస్టు 30, సెప్టెంబరు 6,7 తేదీల్లో ప్రిలిమినరీ పరీక్షలను నిర్వహిస్తారు. దీనిలో అర్హత సాధించే వారికి నవంబరు 9న మెయిన్స్ పరీక్ష జరుగుతుంది.

**ప్రొబేషనరీ ఆఫీసర్లు/మేనేజ్‌మెంట్ ట్రెయినీలు :**

ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసే వారికి అక్టోబరు 4, 5, 11 తేదీల్లో ప్రిలిమినరీ పరీక్షలు జరుగుతాయి. మెయిన్స్ పరీక్ష నవంబరు 29న జరుగుతుంది.

**స్పెషలిస్ట్ ఆఫీసర్స్**

ఈ పోస్టులకు దరఖాస్తు చేసే వారికి నవంబరు 22, 23 తేదీల్లో ప్రిలిమినరీ పరీక్షలు జరుగుతాయి.2026 సంవత్సరం జనవరి 4న మెయిన్స్ పరీక్షలు జరుగుతాయి. కస్టమర్ సర్వీస్ అసోసియేట్స్ : ఈ పోస్టులకు దరఖాస్తు చేసే వారికి డిసెంబరు 6,7, 13, 14 తేదీల్లో పరీక్షలు ప్రిలిమినరీ జరుగుతాయి. మెయిన్స్ పరీక్ష 2026 ఫిబ్రవరి 1న జరుగుతుంది.




# సైఫ్ అలీ ఖాన్ ఇంటిని పరిశీలించిన ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్

బాలీవుడ్ నటుడు.. పటౌడి వంశ వారసుడు సైఫ్ అలీఖాన్ మీద దాడి జరిగిన విషయం తెలిసిందే. అతడిపై గుర్తుతెలియని వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. గురువారం తెల్లవారుజామున ముంబై బాంద్రాలోని ఆయన నివాసంలోకి చొరబడిన దుండగుడు కత్తితో సైఫ్‌పై దాడి చేశాడు. దీంతో ఆయన ఒంటిపై ఆరుచోట్ల గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు ఆయనను హుటాహుటిన లీలావతి దవాఖానకు తరలించారు. గాయలతో ఉన్న సైఫ్‌కి వైద్యులు సర్జరీ చేయగా.. విజయవంతగా పూర్తయినట్లు తెలిసింది. దీంతో సైఫ్ ప్రమాదం నుంచి బయటపడినట్లు ఆసుపత్రి సిబ్బంది వెల్లడించింది. సైఫ్ అలీ ఖాన్ ఇంట్లోకి ప్రవేశించడానికి దొంగలు ఫైర్ ఎస్కేప్ నిచ్చెనను ఉపయోగించారు. ఇది దోపిడీ ప్రయత్నం అని అనిపిస్తుంది. మేము దొంగలను అరెస్ట్ చేయడానికి పనిచేస్తున్నాం. ఈ కేసుపై 10 డిటెక్షన్ టీమ్‌లు పనిచేస్తున్నాయి. అంటూ పోలీసులు ఇప్పటికే వెల్లడించిన విషయం తెలిసిందే. తాజాగా.. ఈ ఘటనపై దర్యాప్తు చేసే బాధ్యతను క్రైం బ్రాంచ్‌లోని ప్రముఖ అధికారి, ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ దయా నాయక్‌కు అప్పగించింది ప్రభుత్వం. దీంతో బాంద్రాలోని సైఫ్ అలీఖాన్ ఇంటిని క్రైమ్ బ్రాంచ్ అధికారులు దయా నాయక్ బృందం కలిసి పరిశీలించారు. కట్టుదిట్టమైన భద్రత ఉన్న ఇంట్లోకి దొంగ ఎలా చొరబడ్డాడు? అనే అంశంతో పాటు సైఫ్‌పై దాడి చేసిన అనంతరం ఎలా తప్పించుకున్నాడు అనే కోణంలో దయా నాయక్ బృందం విచారణ జరుపబోతుంది. దయా నాయక్ విషయానికి వస్తే.. క్రైం బ్రాంచ్‌లో పేరున్న అధికారుల్లో దయా ఒకరు. ముంబై అండర్ వరల్డ్ ను వణికించిన ఎన్ కౌంటర్ స్పెషలిస్టుగా దయాకు మంచి పేరుంది. నాయక్ రాష్ట్రంలోని ఏటీఎస్ (యాంటీ టెర్రరిజం స్క్వాడ్) విభాగంలో మూడేళ్లుగా పనిచేశారు. అతను 1996లో జుహు పోలీస్ స్టేషన్‌లో పనిచేశాడు. అప్పటి నుంచి నగరంలో పేరుమోసిన అండర్ వరల్డ్ నెట్‌వర్క్‌ను ఛేదించడంలో నాయక్ కీలక పాత్ర పోషించాడు. నివేదికల ప్రకారం దయా దాదాపు 80 మందిని ఎన్‌కౌంటర్ చేసినట్లు సమాచారం. దయా నాయక్ జీవిత కథ స్ఫూర్తితో బాలీవుడ్ లో సినిమాలు కూడా వచ్చాయి. అయితే ఇలాంటి వ్యక్తికి ఈ కేసును అప్పగించడంతో ప్రస్తుతం సెన్సేషన్‌గా మారింది.

# లోకేష్ కనగరాజ్‌తో ఆమీర్ ఖాన్ సూపర్ హీరో మూవీ.?

బాలీవుడ్ ఖాన్‌లంతా మళ్లీ సౌత్ బాట పడుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే షారుఖ్ ఖాన్ అట్లీతో కలిసి జవాన్‌తో బ్లాక్ బస్టర్ అందుకోగా.. కండలవీరుడు సల్మాన్ ఖాన్ మురుగుదాస్‌తో కలిసి సికిందర్ అనే మూవీ చేస్తున్నాడు. అయితే ఈ లిస్ట్‌లోకి మరో ఖాన్ రాబోతున్నట్లు తెలుస్తుంది. బాలీవుడ్ మిస్టర్ ఫర్‌ఫెక్ట్ ఆమీర్ ఖాన్ మళ్లీ సౌత్ దర్శకుడితో చేయబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇంతకీ ఆ దర్శకుడు ఎవరో కాదు. ఖైదీ, విక్రమ్, మాస్టర్, లియో లాంటి బ్లాక్ బస్టర్‌లు అందుకున్న తమిళ స్టార్ దర్శకుడు లోకేష్ కనగరాజ్. ఆమీర్ ఖాన్ తన నెక్స్ట్ ప్రాజెక్ట్ లోకేష్ కనగరాజ్‌తో చేయబోతున్నట్లు గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ ప్రాజెక్ట్ కన్‌ఫర్మ్ అయినట్లు తెలుస్తుంది. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన అధికారిక ప్రకటనతో పాటు మిగతా వివరాలను చిత్రబృందం వెల్లడించనున్నట్లు సమాచారం. మరోవైపు ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్‌తో కలిసి డిస్నీ ప్లస్ హాట్ స్టార్ నిర్మించబోతున్నట్లు తెలుస్తుంది. ఈ ప్రాజెక్ట్‌కి మాయావి అనే టైటిల్ అనుకుంటుండగా ఇందులో అమీర్ సూపర్ హీరో పాత్రలో నటించనున్నట్లు టాక్. ఈ చిత్రాన్ని 2027 క్రిస్మస్‌కి తీసుకురాబోతున్నారు.ఇక ఆమీర్ ఖాన్ ప్రస్తుతం తారే జమీన్ పర్ సినిమాకు సీక్వెల్‌గా వస్తున్నా సితారే జమీన్ పర్ అనే సినిమాలో నటిస్తుండగా.. లోకేష్ కనగరాజ్ రజినికాంత్‌తో కలిసి కూలీ అనే సినిమా షూటింగ్‌లో బిజీ ఉన్నాడు.





# లైలా ప్రేమలీలలు

యువ హీరో విశ్వక్‌సేన్ నటిస్తున్న తాజా చిత్రం 'లైలా'. రామ్ నారాయణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని షైన్‌స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఆకాంక్ష శర్మ కథానాయిక. ఈ సినిమాలోని కొన్ని ఎపిసోడ్స్‌లో విశ్వక్‌సేన్ అమ్మాయి పాత్రలో కనిపించనున్నారు. సంక్రాంతి సందర్భంగా విశ్వక్‌సేన్ లేడీ గెటప్‌లోని కొత్త స్టిల్‌ను విడుదల చేశారు. ఇందులో ఆయన అచ్చు అమ్మాయిలా కనిపిస్తున్నారు. లేడీ గెటప్‌లోని సన్నివేశాలు చక్కటి హాస్యాన్ని పండిస్తాయని చిత్ర బృందం చెబుతున్నది. లైలా పాత్రలో విశ్వక్‌సేన్ నటన ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేస్తుందని, ఆయన కెరీర్‌లో ఇదొక వైవిధ్యభరితమైన చిత్రమని మేకర్స్ తెలిపారు. ఈ సినిమా టీజర్‌ను ఈ నెల 17న విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, దర్శకత్వం: రామ్ నారాయణ్.

## వెన్నెల కిషోర్ నా వారసత్వాన్ని కొనసాగిస్తాడు : బ్రహ్మానందం



బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'బ్రహ్మ ఆనందం'. వెన్నెల కిషోర్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఆర్‌వీఎస్ నిఖిల్ దర్వకత్వం వహిస్తున్న ఈ సినిమాను స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రాహుల్ యాదవ్ నక్కా నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది ఈ చిత్రం. నేడు ఈ సినిమా నుంచి టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. అయితే ఈ టీజర్ వేడుకలో బ్రహ్మి మాట్లాడుతూ.. ఈ మధ్య మొహం చూడగానే నవ్వు తెప్పించే వారిలో వెన్నెల కిషోర్ ఉన్నాడు. వెన్నెల కిషోర్ తెరపై కనిపిస్తే చాలు ఆటోమేటిక్‌గా నవ్వు వస్తుంది. నా వారసత్వాన్ని కొనసాగించే వారిలలో వెన్నెల కిషోర్ ఒక్కడు. అంతా సరదాగా నటిస్తాడు కిషోర్ అంటూ బ్రహ్మి చెప్పుకోచ్చాడు.

# క్రీడా వార్తలు | SPORTS NEWS



# జకో జోరు

## రికార్డు మ్యాచ్‌లో విజయం

### అల్కరాజ్, జ్వెరెవ్ ముందంజ
### మూడో రౌండ్‌కు సబలెంక, గాఫ్..రూడ్, జెంగ్ నిష్క్రమణ

**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియా ఓపెన్‌లో మాజీ చాంపియన్ నొవాక్ జకోవిచ్ జోరు కొనసాగిస్తున్నాడు. జకోతో పాటు కార్లొస్ అల్కరాజ్, అలెగ్జాండర్ జ్వెరెవ్ ముందంజ వేయగా ఆరో సీడ్ కాస్పర్ రూడ్‌కు షాక్ తగిలింది. 25వ గ్రాండ్‌స్లామ్ వేటలో ఉన్న జకోవిచ్.. రికార్డు మ్యాచ్‌లో గెలిచి ఈ టోర్నీ మూడో రౌండ్‌కు ప్రవేశించాడు. బుధవారం మెల్‌బోర్న్‌లోని రాడ్‌లీవర్ ఎరీనాలో జరిగిన పురుషుల సింగిల్స్ మూడో రౌండ్‌లో ఏడో సీడ్ జకో..61, 67 (4/7), 63, 62తో పోర్చుగల్‌కు చెందిన జెమీ ఫెరియాను చిత్తు చేశాడు. మ్యాచ్‌లో 14 ఏస్‌లు సంధించిన జకో.. 33 విన్నర్లు కొట్టాడు. 33 అనవసర తప్పిదాలు చేసిన సెర్బియా దిగ్గజం.. రెండో సెట్‌ను చేజార్చుకున్నప్పటికీ తర్వాత పుంజుకుని ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశమివ్వకుండా మ్యాచ్‌ను గెలుచుకున్నాడు. నొవాక్‌కు ఇది 430వ గ్రాండ్‌స్లామ్ మ్యాచ్ కావడం విశేషం. టెన్నిస్‌లో ఓపెన్ ఎరా ప్రారంభమయ్యాక రోజర్ ఫెదరర్ (429) గ్రాండ్‌స్లామ్ మ్యాచ్‌ల రికార్డును జకో అధిగమించాడు. మిగిలిన మ్యాచ్‌లలో అల్కరాజ్.. 60, 61, 64తో నిషియొక (జపాన్) పై పెద్దగా కష్టపడకుండానే విజయం సాధించాడు. జ్వెరెవ్ (జర్మనీ) 61, 64, 61తో పెడ్రో మార్టిన్ (స్పెయిన్)ను ఓడించాడు. కాస్పర్ రూడ్.. 26, 63, 16, 14తో జాకుబ్ మెన్సిక్ (చెక్) చేతిలో నిష్క్రమించి ఇంటిబాట పట్టాడు.

### సబలెంక, గాఫ్ ముందుకు..

మహిళల విభాగానికొస్తే హ్యాట్రిక్ టైటిల్ వేటలో ఉన్న ఒకటో సీడ్ అరీనా సబలెంక.. 63, 75తో జెస్సికా మనీరొ (స్పెయిన్)ను ఓడించి మూడో రౌండ్‌కు చేరుకుంది. అమెరికా అమ్మాయి కోకో గాఫ్ 63, 75తో జోడీ అన్నా (యూకే)పై అలవోక విజయం సాధించింది. జపాన్ ప్లేయర్ నవొమి ఒసాకా.. 16, 61, 63తో కరోలినా ముచోవా (చెక్)ను ఓడించింది. గత మూడేండ్లలో గ్రాండ్‌స్లామ్ ఈవెంట్ ఆడుతూ మూడో రౌండ్‌కు చేరడం ఒసాకాకు ఇదే తొలిసారి. గత సీజన్ రన్నరప్ అయిన చైనా అమ్మాయి కిన్వెన్ జెంగ్ పోరాటం రెండో రౌండ్‌లోనే ముగిసింది. రెండో రౌండ్‌లో జెంగ్ 67 (3/7), 36తో లారా సిగ్మండ్ (జర్మనీ) చేతిలో పరాభవం పాలైంది.




# రికార్డుల మోత..

## ఐర్లాండ్‌పై 304 పరుగుల తేడాతో భారత్ భారీ విజయం

### స్మృతి, ప్రతీక శతక గర్జన.. దీప్తి స్పిన్ మాయాజాలం.. సిరీస్ 3-0తో క్లీన్‌స్వీప్

**రాజ్‌కోట్:** కొత్త రికార్డులు నమోదైన రాజ్‌కోట్‌లో భారత మహిళల జట్టు అదరగొట్టింది. స్వదేశంలో ఐర్లాండ్‌తో జరిగిన మూడో వన్డేలో ఏకంగా 304 పరుగుల భారీ తేడాతో విజయం సాధించి పాత రికార్డుల దుమ్ము దులిపింది. అన్ని విభాగాల్లోనూ అదరగొట్టిన టీమ్‌ఇండియా..సిరీస్‌ను 30తో క్లీన్‌స్వీప్ చేసింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన మంధాన సేన.. నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లు మాత్రమే కోల్పోయి 435 పరుగుల రికార్డు స్కోరు చేసింది. వన్డేలలో భారత్ (పురుషుల, మహిళల)కూ ఇదే అత్యుత్తమ స్కోరు కావడం విశేషం. ఓపెనర్లు ప్రతీక రావల్ (129 బంతుల్లో 154, 20 ఫోర్లు, 1 సిక్స్), స్మృతి మంధాన (80 బంతుల్లో 135, 12 ఫోర్లు, 7 సిక్సర్లు) శతకాల మోత మోగించగా రిచా ఘోష్ (42 బంతుల్లో 59, 10 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడటంతో ప్రత్యర్థి ఎదుట భారత్ భారీ స్కోరును నిలిపింది. అనంతరం ఛేదనలో ఐర్లాండ్.. 31.4 ఓవర్లలో 131 పరుగులకే కుప్పకూలింది. ఆ జట్టులో సారా ఫోర్బ్స్ (41) ఫర్వాలేదనిపించగా మిగిలినవారంతా చేతులెత్తేశారు. భారీ శతకం బాదిన ప్రతీకకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'తో పాటు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులూ లభించాయి.


### ఆది నుంచే దూకుడు మంత్రం

గత కొంతకాలంగా అద్భుత ఫామ్‌లో ఉన్న మంధాన, ఇటీవలే జట్టులోకి వచ్చి నిలకడగా ఆడుతున్న ప్రతీక ప్రారంభ ఓవర్ల నుంచే ఐర్లాండ్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. ప్రెండర్‌గస్ట్ 3వ ఓవర్లోనే ప్రతీక 3 బౌండరీలు బాది తన ఉద్దేశాన్ని చెప్పకనే చెప్పింది. మ్యాచ్ ఆసాంతం ఆమె అదే జోరును కొనసాగించింది. అర్లైన 9వ ఓవర్లో స్మృతి.. 6, 6, 4 బాదడంతో స్కోరువేగం మరింత పుంజుకుంది. ఈ క్రమంలో ఆమె 31 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తిచేసుకుంది. 17వ ఓవర్లో బౌండరీతో 52 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేశాక ప్రతీక మరింత జోరు పెంచింది. బౌండరీలు, సిక్సర్లతో చెలరేగిన మంధాన.. 70 బంతుల్లోనే తన పదో శతకాన్ని సాధించింది. భారత్ (మహిళల) తరఫున వన్డేలలో ఇదే అత్యంత వేగవంతమైన సెంచరీ. ఈ ఇద్దరి దూకుడుతో 24 ఓవర్లకే భారత్.. వికెట్ నష్టపోకుండా 202 పరుగులు చేసింది. సెంచరీ తర్వాత మరింత వేగంగా ఆడే క్రమంలో మంధాన 27వ ఓవర్లో పెవిలియన్ చేరింది. దీంతో 233 పరుగుల తొలి వికెట్ (26.4 ఓవర్లలోనే) భాగస్వామ్యానికి తెరపడింది.

### సంక్షిప్త స్కోర్లు

భారత్: 50 ఓవర్లలో 435/5 (ప్రతీక 135, స్మృతి 135, ప్రెండర్ గస్ట్ 2/71)
ఐర్లాండ్: 31.4 ఓవర్లలో 131 ఆలౌట్ (సారా 41, ప్రెండర్‌గస్ట్ 36, దీప్తి 3/27)

# బ్యాటింగ్ కోచ్‌ను నియమించనున్న బీసీసీఐ..! ఆసక్తిని వ్యక్తం చేసిన కెవిన్ పీటర్సన్..!



గతేడాది జరిగిన టీ20 ప్రపంచకప్ తర్వాత హెడ్‌కోచ్ రాహుల్ ద్రవిడ్ పదవీకాలం ముగిసింది. ఆ తర్వాత గౌతమ్ గంభీర్ హెడ్‌కోచ్‌గా నియామకమయ్యాడు. ఆ తర్వాత బౌలింగ్ కోచ్‌గా మోర్కెల్ బాధ్యతలు తీసుకోగా.. అభిషేక్ నాయర్, ర్యాన్ టెన్ డోషేట్‌ను అసిస్టెంట్ కోచ్‌లుగా బీసీసీఐ నియమించింది. ప్రస్తుతం టీమిండియాకు బ్యాటింగ్ కోచ్ అందుబాటులో లేడు. ఈ క్రమంలో బీసీసీఐ కొత్త బ్యాటింగ్ కోచ్‌ను నియమించాలని పరిశీలిస్తున్నది. ఈ క్రమంలోనే ఇంగ్లాండ్ దిగ్గజం కెవిన్ పీటర్సన్ భారత జట్టుకు బ్యాటింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు ఆసక్తిని చూపారు. వాస్తవానికి గౌతమ్ గంభీర్ హెడ్‌కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి టీమిండియా ప్రదర్శన ఏమాత్రం ఆకట్టుకోలేకపోయింది. ఒక టీ20 సిరీస్, ఒక వన్డే సిరీస్, రెండు మూడు టెస్టు సిరీస్‌లను ఆడింది. స్వదేశంలో న్యూజిలాండ్‌తో మూడు టెస్టుల్లో ఓటమిపాలైంది. ఆ తర్వాత ఆస్ట్రేలియాలోనూ సిరీస్‌ను కోల్పోయింది. శ్రీలంకలో జరిగిన వన్డే సిరీస్‌లో ఓటమి మూటగట్టుకుంది. ఈ నేపథ్యంలో టీమిండియాకు బ్యాటింగ్ కోచ్‌ను నియమించేందుకు సన్నద్ధమవుతుందని పలు నివేదికలు పేర్కొన్నాయి. ఈ క్రమంలోనే ఓ ట్వీట్‌ను కెవిన్ పీటర్సన్ రీ ట్వీట్ చేస్తూ.. అందుబాటులో ఉన్నానంటూ స్పందించారు. ఇదిలా ఉండగా.. బీసీసీఐ సితాన్షు కొటక్‌ను బ్యాటింగ్ కోచ్‌గా నియమించేందుకు అవకాశం ఉందని ఓ జాతీయ మీడియా కథనం పేర్కొంది. సితాన్షు ప్రస్తుతం ఇండియా ఏ జట్టు హెడ్‌కోచ్‌గా కొనసాగుతున్నాడు. ఆయన పర్యవేక్షణలోనే ఇండియా ఏ జట్టు ఆస్ట్రేలియా పర్యటించింది. 2023 ఆగస్టులో టీమిండియా ఐర్లాండ్ పర్యటన సమయంలో రాహుల్ ద్రవిడ్ గైర్హాజరీలో సితాన్షు హెడ్‌కోచ్‌గా వ్యవహరించారు. ఈ సిరీస్‌లో బుమ్రా జట్టుకు కెప్టెన్‌గా బాధ్యతలు తీసుకున్నాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com